మద్యం కుంభకోణంపై.. సీఐడీ

ఈనాడు, కాకినాడ– న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం, జగ్గంపేట గ్రామీణం, రంగంపేట: వైకాపా ప్రభుత్వంలో ఎన్నడూ వినని బ్రాండ్లు, రకరకాల లేబుళ్లతో నాసిరకం మద్యం మార్కెట్ మెట్లెక్కింది. ప్రజల ఆరోగ్యం దెబ్బతింది. ప్రాణాలు కోల్పోయే పరిస్థితీ ఎదురయ్యింది. దుకాణాల్లో ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం ఇవ్వకపోగా.. పెద్ద ఎత్తున నగదు లావాదేవీలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు.. ఈ భారీ మద్యం కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో సీఐడీ రంగంలోకి దిగింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, రంగంపేట మండలాల్లోని మద్యం డిస్టిలరీల్లో సీఐడీ అధికారుల బృందాలు మంగళవారం ముమ్మర తనిఖీలు చేపట్టాయి. ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం పాల్గొని సీఐడీ బృందాలకు సహకారం అందించారు.

మూడుచోట్ల ముమ్మరంగా..

✦ అనపర్తి మండలం కొప్పవరం గ్రామ సమీప బీడీహెచ్ అగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో విశాఖ సీఐడీ డీఎస్పీ నాగేంద్ర భూపాల్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలు, ఇతర సీఐడీ, ఎక్సైజ్, పోలీసు సిబ్బంది 20 మంది సోదాల్లో పాల్గొన్నారు. గడిచిన ఏడేళ్లుగా ఈ పరిశ్రమ కార్యకలాపాలపై ఆరా తీశారు. 1.20 లక్షల కేసుల సామర్థ్యం ఉన్న ఐఎంఎఫ్ఎల్ తయారీ పరిశ్రమలో కీలక దస్త్రాలు నిశితంగా పరిశీలించారు. అనుమతులు, ఉత్పత్తుల తీరుపై ఆరా తీశారు.

డిస్టిలరీల్లో ప్రత్యేక బృందాల సోదాలు

✦ రంగంపేట మండలం కోటపాడులో 1.50 కోట్ల సీసాల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పీఎంకే డిస్టిలేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సీఐడీ డీఎస్పీ కుమారస్వామి ఆధ్వర్యంలో 15 మంది సోదాల్లో పాల్గొన్నారు. ఎక్సైజ్ డిస్టిలేషన్, పోలీసు, రెవెన్యూ అధికారులూ ఉన్నారు. ✦ రంగంపేట మండలం నల్లమిల్లిలోని ప్రాగ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 మంది వరకు సీఐడీ, ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.



రంగంపేట: నల్లమిల్లిలో సీఐడీ తనిఖీచేసిన డిస్టిలరీ

కీలక ఆధారాలు స్వాధీనం..

తనిఖీల్లో కీలక దస్త్రాలను సీఐడీ బృందం పరిశీలించింది. వాటితో పాటు హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. ఆయా డిస్టిలరీల్లో తయారీలకు ఉన్న అనుమతులు, ఉత్పత్తుల తీరు నిశితంగా పరిశీలించారు. కొన్నిచోట్ల తేడాలు గుర్తించారు. 2019 నుంచి 2024 మధ్య వైకాపా ప్రభుత్వంలో మద్యం తయారీ, సరఫరాలకు సంబంధించిన దస్త్రాలపై సీఐడీ ఆరా తీసినట్లు తెలుస్తోంది.

తూర్పు తీరాన.. వీచేనా ఐటీ వీచిక

▮ కీలక రంగానికి అనువైన వనరులు పుష్కలం ▮ కూటమి ప్రభుత్వ నిర్ణయంతో కొత్త ఆశలు

▮ గతం: గత ఐదేళ్లూ సాఫ్ట్‌వేర్‌కు వైకాపా వైరస్ పట్టుకుంది. కీలక ఐటీ రంగానికి ప్రోత్సాహం కరవు. కనీస రోడ్లు, వీధి దీపాలు ఇతర సదుపాయాలు కల్పించలేని పరిస్థితుల్లో చాలా సంస్థలు మూతపడ్డాయి.

▮ ప్రస్తుతం: రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ఐటీ రంగంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రెండు లక్షల మందికి ఉపాధి కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2024- 29 ముసాయిదా ఐటీ విధానం సిద్ధం చేసింది.

ఈనాడు, కాకినాడ

కాకినాడ, రాజమహేంద్రవరం.. ఈ రెండు నగరాలు ఐటీ రంగానికి కీలకం.. 5వేలకు పైగా ఐటీ నిపుణులు ఉన్నారు. విశాఖలో హుద్‌హుద్‌తో వ్యవస్థలు స్తంభించిపోతే.. ఈ రెండు చోట్లనుంచే కార్యకలాపాలు సాగాయి. వైకాపా ప్రభుత్వం వచ్చాక పూర్తిగా నీరుగార్చింది. కూటమి ప్రభుత్వంతో ఆశలు చిగురించాయి. తూర్పు తీరాన అంకురాలు, ఆవిష్కరణలకు అడుగులు పడతాయని, సాఫ్ట్‌వేర్ రంగానికి ఊతం దక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


కాకినాడ గ్రామీణం ఆటోనగర్‌లోని ఐటీ సెజ్‌లో అంకుర కేంద్రం

రాష్ట్రంలో నాలుగు ఐటీ చాప్టర్లు ఉంటే.. అందులో ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటీఏఏపీ) గోదావరి చాప్టర్ ఒకటి.. దీని పరిధిలో ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలు ఉభయ గోదావరి జిల్లాల్లో 55 వరకు ఉంటే.. 10వేల మంది పనిచేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మొబైల్ అప్లికేషన్, ఏఐ, డేటా, క్లినికల్ ట్రైల్ ప్రొడక్ట్స్.. బిజినెస్ ప్రాసెస్, గ్లోబల్ పొజిషనింగ్, మ్యాపింగ్ సొల్యూషన్, డేటా సర్వీసెస్ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

▮ కాకినాడ కలెక్టరేట్‌లో గోదావరి ఐటీ కేంద్రం 'సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా' అంకుర సంస్థలకు ఊతమిచ్చే వేదిక ఉంది. సర్పవరం ఆటోనగర్‌లోని ఐటీ సెజ్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఉంది. క్రిఫై సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, అవినియన్ ఇండియా, సైయింట్, అడ్వర్రా ఇండియా, ప్రైమ్ సాఫ్ట్ ఇండియా, నైరోస్ టెక్నాలజీస్, ఐప్రో గ్లోబల్ సర్వీసెస్, వినూత్న ఐటీ సర్వీసెస్, సన్‌రైజ్ సొల్యూషన్స్ ఉన్నాయి.

ఊతమిస్తే కొత్త ఊపు..

ఉమ్మడి జిల్లాలో ఐటీ కారిడార్ కార్యరూపం దాల్చాలి. ఆటోనగర్‌లోని ఐటీ సెజ్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌కు వైభవం తేవాలి. స్టార్టప్స్, ఇంక్యుబేటర్లను ప్రోత్సహించాలి. ఐటీ పరిశ్రమలకు అనువైన భూములు ఇవ్వడం, ప్రస్తుతం ఉన్న ప్రాంగణాల చుట్టూ వసతులు తేవాలి. ఐటీ పార్కులు, కోవర్కింగ్ స్పేస్‌ల అభివృద్ధికి రాయితీలు, పన్ను ప్రయోజనాలు కల్పిస్తే ఉపయుక్తం.

కాకినాడ ఐటీ సెజ్ నుంచి సర్పవరం వరకు రహదారి అధ్వానం. రతన్ టవర్స్‌కు వెళ్లే మార్గంలో వీధి దీపాలు, సదుపాయాలు లేవు.. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి కాకినాడ కలిపే ఏడీబీ రోడ్డు మెరుగుపరచాల్సి ఉంది.

అవకాశాలెన్నో..

రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి రోజువారీ విమానయాన సౌకర్యం ఉంది. కోల్‌కతా నుంచి చెన్నై వరకు ప్రధాన రైల్వే లైను హైదరాబాద్, ఇతర నగరాలను కలుపుతూ ఉంది. పోర్టులు, పరిశ్రమలతో వ్యాపార, వాణిజ్య రంగంలో ఇప్పటికే అభివృద్ధి చెందింది.

▮ జేఎన్‌టీయూకే, నన్నయ విశ్వవిద్యాలయంతోపాటు.. ప్రధాన విద్యాసంస్థలు, కళాశాలల నుంచి ఏటా 15వేల మందికి పైగా సాంకేతిక విద్య పూర్తిచేస్తున్నారు. స్థానిక ఐటీ పరిశ్రమల్లో వీరి ప్రతిభకు చోటిస్తే ఆవిష్కరణలకు ఊతమిచ్చినట్లే. కోర్ ఐటీ సేవలు, గ్రామీణ ఐటీ, ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, అగ్రిటెక్, పరిశ్రమల అభివృద్ధికి, ప్రగతికి ఆస్కారం ఉంది.

అనువైన ప్రాంతమిది..



రాష్ట్రంలో బలమైన ఐటీ కేంద్రంగా మారడానికి అనువైన ప్రాంతం ఇది. ఉద్యోగావకాశాలతో పాటు ఆర్థికంగా ఈ ప్రాంత అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. గోదావరి చాప్టర్ పరిధిలో చక్కదిద్దాల్సిన సమస్యలను విశాఖలో జరిగిన ఇంటరాక్టివ్ సమావేశంలో మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాం.

- కొవ్వూరి కృష్ణారెడ్డి, పూర్వ ఛైర్మన్, ఐటీఏఏపీ గోదావరి చాప్టర్/ సీఈవో, క్రిఫై సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్

జ్ఞానమూర్తి.. విశ్వకీర్తి


స్వామివారికి అభిషేక క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

వీణాపాణిగా మలయప్ప స్వామి దర్శనం

ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం వీణాపాణిగా, చదువుల తల్లి సరస్వతీ అవతారంలో దర్శనమిచ్చారు. మలయప్పస్వామి వీణ ధరించి హంస వాహనరూఢుడై వివేకాన్ని భక్తులకు బోధిస్తున్నట్లు కనిపించారు. గోవింద నామస్మరణ నడుమ దేవదేవుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ జ్ఞానమూర్తిగా ప్రకాశించారు. తొలుత విష్వక్సేన పూజ, పంచామృత మండపారాధన, స్నపనం, అష్టదళ పాద పద్మారాధన కార్యక్రమాలను పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవంలో నేడు: బుధవారం అష్టోత్తర శతకలశాభిషేకం, కోదండరామ అలంకరణలో హనుమత్ వాహన సేవ ఉంటాయి.


శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన


ఆకట్టుకున్న శక్తి వేషధారణలు

మనలేక మరణ శాసనం

▪ అంబాజీపేటలో వస్త్ర వ్యాపారి దంపతుల ఆత్మహత్య
▪ పదకొండేళ్ల క్రితం కుమారుడి కుటుంబం సైతం బలవన్మరణం

అంబాజీపేట, న్యూస్‌టుడే

ఆర్థిక కష్టాలు, అనారోగ్యం ఆ దంపతులను తీవ్ర మనోవేదనకు గురిచేశాయి. జీవితాంతం ఒకే మాట, బాటగా నడిచినవారు ఇక ఈ ప్రపంచంలో మనలేమంటూ శాశ్వత వీడ్కోలు పలికి అయినవారికి తీరని శోకం మిగిల్చారు. అంబాజీపేటలో మంగళవారం చోటుచేసుకున్న వస్త్ర వ్యాపారి దంపతుల విషాదాంతమిది. సరిగ్గా పదకొండేళ్ల క్రితం వారి కుమారుడు, కోడలు, ఇద్దరు మనుమలు సైతం విష రసాయనం తాగి బలవన్మరణం చెందారు. ఒకే కుటుంబంలో ఆరుగురు ఇలా తనువు చాలించడం కలచివేసింది.

అంబాజీపేట పెద్దవీధికి చెందిన వ్యాపారి పాబోలు రామసుబ్రహ్మణ్యం అలియాస్ రాంబాబు (60), ఆయన భార్య నాగమణి(57) మంగళవారం తెల్లవారుజామున తమ ఇంటిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పైఅంతస్తు పడకగదిలో రామసుబ్రహ్మణ్యం భార్య విగతజీవిగా పడి ఉన్నారు. రాంబాబు కింది అంతస్తులోని ద్వారానికి ఉన్న ఇనుప గ్రిల్స్‌కు వస్త్రంతో ఉరేసుకొన్నారు.


రామసుబ్రహ్మణ్యం మృతదేహాన్ని పరిశీలిస్తున్న నగరం ఎస్సై చైతన్యకుమార్


రామసుబ్రహ్మణ్యం, నాగమణి దంపతులు (పాత చిత్రాలు)

ఎవరూలేని సమయంలో..

రాంబాబు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు వెంకటకిరణ్ 2013లో భార్య లక్ష్మీశ్వేత, కుమార్తె శ్రావణి, 9 నెలల వయసున్న కుమారుడితో సహా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో విష రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెద్ద కుమార్తె అమలాపురంలో ఉండగా.. చిన్నకుమార్తె వంకాల సునీత తన బిడ్డ మానసతో కలిసి తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. రెండు రోజుల క్రితం సునీత విశాఖలో బంధువుల వివాహానికి వెళ్లారు. మంగళవారం తల్లిదండ్రులకు అల్పాహారం తీసుకెళ్లమని స్థానిక యువతికి సునీత ఫోన్‌లో చెప్పారు. ఆమె వెళ్లగా సంఘటన బయటపడింది.

నాటినుంచి మనోవేదన

రాంబాబు అంబాజీపేట మహిళల ఆసుపత్రి రోడ్డులోను, అయినవిల్లి మండలం సిరిపల్లి వద్ద సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ప్రొడక్ట్స్ పేరుతో కొబ్బరినూనె, పామాయిల్ వ్యాపారాలు నిర్వహించేవారు. కముజువారిలంక వద్ద నర్సరీ ఉండేది. నష్టాలు రావడంతో వాటన్నింటిని విక్రయించేశారు. ఏడేళ్ల నుంచి ఇంటివద్దే ఆదిత్య గార్మెంట్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. ఇందులోనూ ఆర్థిక ఇబ్బందులు చవిచూశారు. దీనికితోడు పదకొండేళ్ల క్రితం కుమారుడి కుటుంబమంతా బలవన్మరణం చెందడంతో మనోవేదనకు గురయ్యారు. ఎన్ని మందులు వాడినా ఆరోగ్యం కుదుట పడకపోవటంతో రాంబాబు దంపతులు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు బంధువులు, పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సంఘటనా స్థలాన్ని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ పరిశీలించారు. అంబాజీపేట ఏఎస్సై వై.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మాచవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. 'నేను మానసిక, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులతో మనోవేదన చెందుతున్నాను. ఇప్పటివరకు మా దంపతులకు కుమార్తె సునీత, మనుమరాలు చాలా సేవ చేశారు. నా తమ్ముళ్లు కృష్ణ, శ్రీనులు నా కుమార్తెలను కన్నబిడ్డల్లా చూడాలి' అంటూ రాంబాబు రాసిన ఆత్మహత్య లేఖ ఇంటిలో లభించింది.

అకారణంగా కేసుల్లో ఇరికించారు: మంత్రి సుభాష్

నవంబరు 24న రెండు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తిక వనసమారాధన

అమలాపురం పట్టణం: గతంలో జరిగిన కోనసీమ అల్లర్ల కేసులో తనను, కొంత మంది అమాయకులను అకారణంగా ఇరికించారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శెట్టిబలిజ సామాజిక వర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. నవంబరు 24న శెట్టిబలిజ కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. రెండు రాష్ట్రాల నుంచి వర్గీయులు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక వర్గం తనను ఈ స్థాయిలో నిలబెట్టిందన్నారు. మీరు చూపిన ఆప్యాయతకు ఎప్పుడూ విధేయుడిగా ఉంటానన్నారు. కార్తిక వనసమారాధనకు అయ్యే ఖర్చు తన తండ్రి సత్యం భరిస్తారని తెలిపారు. ఎవరైనా స్వచ్ఛందంగా ఇస్తే తీసుకుంటారన్నారు. సామాజికవర్గాలకు విద్య, వైద్యం, ఆర్థిక విషయాల్లో ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సుభాష్

జిల్లాలో 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

అమలాపురం కలెక్టరేట్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో 370 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత ఆలమూరు, మండపేట మండలాల్లో కోతలు జరిగే అవకాశం ఉందన్నారు. తుపాన్లు, అధిక వర్షాలకు పంట తడవకుండా టార్పాలిన్లు అందిస్తామన్నారు. కొనుగోలు ప్రక్రియలో సమస్యలను పరిష్కరించేందుకు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తామన్నారు.

మద్దతు ధరలు ఇలా..: సాధారణ రకం క్వింటా రూ.2,300, 75 కేజీలకు రూ.1,725, గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2,320, 75 కేజీలకు రూ.1,740గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతుల బయోమెట్రిక్ తీసుకుని ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. జేసీ నిశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. మిల్లర్లు గోనె సంచులు, తేమ శాతాల్లో తేడాలు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి తెలిపారు.


ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మాజీ మంత్రి విశ్వరూప్ ఆలోచించుకోవాలి: ఎంపీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అయినవిల్లికి చెందిన దుర్గాప్రసాద్ హత్య జరిగి రెండున్నరేళ్లయినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని, అతని భార్య న్యాయం చేయాలని కోరితే కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ అన్నారు. మంగళవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. తన కుమారుడి అనుచరుడు హత్యకు గురైనా మాజీ మంత్రి విశ్వరూప్ ఎందుకు పట్టించుకోలేదన్నారు. తన భర్తను స్నేహితుడే తీసుకువెళ్లి హత్య చేశాడని, పిల్లలు అనాథలయ్యారని మృతుడి భార్య మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో మొరపెట్టుకున్నారన్నారు. ఈ హత్య కేసులో విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ ఉన్నాడని పోలీసుల విచారణలో తేలిందన్నారు. చట్టం తన పని తాను చేస్తుందని ఎంపీ పేర్కొన్నారు.

హత్యకేసులో ప్రధాన నిందితుడు మాజీ మంత్రి కుమారుడే

☛ కొత్తపేటలో డీఎస్పీ గోవిందరాజు వెల్లడి ☛ శ్రీకాంత్‌కు వైద్య పరీక్షలు
☛ రాత్రి 11.10కు అమలాపురంలో న్యాయమూర్తి ఎదుట హాజరు

ఈనాడు, రాజమహేంద్రవరం - న్యూస్‌టుడే, కొత్తపేట, రావులపాలెం, అమలాపురం పట్టణం/గ్రామీణం: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వాలంటీరు, వైకాపా నాయకుడు జనుపల్లి దుర్గాప్రసాద్‌ను మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ పథకం ప్రకారమే హత్య చేయించారని కొత్తపేట డీఎస్పీ గోవిందరావు వెల్లడించారు. తమిళనాడులోని మధురైలో అరెస్టు చేసిన శ్రీకాంత్‌ను మంగళవారం రాత్రి 9.40 గంటల సమయంలో కొత్తపేట డీఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చారు. రాత్రి 11.10 గంటలకు అమలాపురంలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గౌరీశంకర్‌రావు ఎదుట హాజరుపరిచారు. అంతకు ముందు హత్య కేసు వివరాలను కేసు దర్యాప్తు అధికారి, కొత్తపేట డీఎస్పీ గోవిందరావు మీడియాకు వివరించారు. 2022 జూన్ 6న జరిగిన హత్యకు సంబంధించి అయినవిల్లిలో నమోదైన కేసులో అప్పటి దర్యాప్తు అధికారులు సేకరించిన ఆధారాలతో పాటు, మరిన్ని సాంకేతిక ఆధారాలతో ఈనెల 18న అనుమానితుడు వడ్డే ధర్మేశ్‌ను విచారించామన్నారు. హత్యకు సంబంధించిన వివరాలన్నీ ఆయన వెల్లడించారన్నారు. అతని స్టేట్‌మెంట్‌తో పాటు ఇతర ఆధారాల మేరకు సమగ్ర దర్యాప్తు చేసి కేసులో ప్రధాన నిందితుడు పినిపే శ్రీకాంత్ అని నిర్ధారించామన్నారు. ధర్మేశ్‌ను 18న అరెస్టు చేసిన తరువాత శ్రీకాంత్ పరారయ్యారని చెప్పారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి హైదరాబాద్, తమిళనాడులోని మధురై ప్రాంతాలకు వెళ్లిపోగా ప్రత్యేక బృందం సోమవారం రాత్రి అరెస్టు చేసిందన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ

వ్యక్తిగత కారణాల వల్లే హత్య..

జనుపల్లి దుర్గాప్రసాద్‌ను వ్యక్తిగత కారణాల వల్ల శ్రీకాంత్ హత్య చేయించారని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడు ధర్మేశ్ వైకాపా సోషల్ మీడియా కన్వీనర్‌గా వ్యవహరించేవారన్నారు. దుర్గాప్రసాద్‌తో ఏర్పడిన వ్యక్తిగత కారణాలు, మనస్పర్థల వల్ల అతణ్ని హత్య చేసేందుకు శ్రీకాంత్ 2022 జూన్ 5న ప్రణాళిక చేశారన్నారు. అందులో భాగంగా ధర్మేశ్.. దుర్గాప్రసాద్‌ను కోటిపల్లి రేవు వద్దకు తీసుకెళ్లగా మరో నలుగురు కలసి అతని మెడకు తాడు బిగించి హత్య చేసినట్లు తేలిందన్నారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చామన్నారు. మరికొందరు నిందితుల్ని విచారించాల్సి ఉందన్నారు.


కారు ఎక్కి నినాదాలు చేస్తున్న పినిపే శ్రీకాంత్

రూ.లక్ష ఇచ్చా.. గేటు వద్ద నినాదాలు

అతని కొడుక్కి నేను పేరు పెట్టా.. దుర్గాప్రసాద్ చనిపోతే నేను వాళ్ల ఇంట్లో రూ.లక్ష ఇచ్చా. కేసు దర్యాప్తు చేయమని అప్పటి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డికి మూడుసార్లు కోరానని హత్య కేసు ప్రధాన నిందితుడు శ్రీకాంత్ అన్నారు. కొత్తపేట నుంచి అమలాపురం తరలిస్తున్న క్రమంలో వాహనం ఎక్కుతూ బిగ్గరగా అరిచి ఈ అంశాలను పేర్కొన్నారు. అమలాపురం కోర్టు ప్రధాన ద్వారం వద్ద వైకాపా శ్రేణులు శ్రీకాంత్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని అందర్నీ అక్కడి నుంచి పంపేశారు.

ఉగ్రవాదులను పట్టేసిన 'ఆక్టోపస్'!

నగరం జీసీఎస్‌లో పోలీసుల మాక్‌డ్రిల్

అది మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని ఓఎన్జీసీ గ్యాస్ కలెక్టింగ్ స్టేషన్. నలుగురు ఉగ్రవాదులు అమాంతం దాడి చేశారు. జీపీఎస్‌లోకి చొరబడ్డారు. అందులో ఓ ఉద్యోగిని అపహరించి హతమారుస్తామని బెదిరింపులకు దిగారు. స్థానిక పోలీసులు, సీఐఎస్ఎఫ్ ద్వారా ఆక్టోపస్ బృందం సమాచారం అందుకొంది. మంగళగిరి నుంచి 30 మంది బృందం హుటాహుటిన చేరుకొంది. అత్యాధునిక తుపాకులు, ఇతర రక్షణ సామగ్రితో జీసీఎస్, రిఫైనరీని చుట్టుముట్టారు. అందులో దాక్కున్న ఉగ్రవాదులను మెరుపు వేగంతో అదుపులోకి తీసుకొన్నారు... ఆక్టోపస్ పోలీసులు మంగళవారం చేపట్టిన మాక్‌డ్రిల్ ఇది. జీసీఎస్‌పై ఎవరైనా అకస్మాత్తుగా దాడిచేస్తే యుద్ధప్రాతిపదికన జరగాల్సిన కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ హడావుడి అంతా చూసి ఏమి జరుగుతుందో తెలియక స్థానికులు అయోమయానికి గురయ్యారు. మాక్‌డ్రిల్ తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు


జీసీఎస్ వద్ద ఆక్టోపస్ పోలీసులు

కొబ్బరి ఉప ఉత్పత్తులతో రైతుకు మేలు

మలికిపురం, న్యూస్‌టుడే: కొబ్బరి ఉప ఉత్పత్తులతోనే రైతులకు మేలు జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. తూర్పుపాలెంలో కోకో పార్క్ (కొబ్బరి ఉత్పత్తుల పరిశ్రమల కేంద్రం) ఏర్పాటుపై కేశనపల్లిలో సర్పంచి యెనుముల నాగు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డును కోనసీమ ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తే మంచిదని పలువురు రైతులు కోరారు. పరిశ్రమల శాఖ జిల్లా అధికారి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు డిప్యూటీ డైరెక్టరు కుమార్‌వేలు(విజయవాడ), ఉద్యానశాఖ జిల్లా అధికారి బి.వి.రమణ, గుండుబోగుల పెద్దకాపు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ


సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో 83 సాగునీటి సంఘాలకు నిర్వహించే ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలైంది. కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలో 82 మేజరు, ఒక మైనరు నీటి వినియోగదారుల సంఘాలు, 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధించి ప్రతి మండలానికి తహసీల్దార్, జలవనరుల శాఖ ఏఈలను నియమించారు. ఈ నెల 31న ప్రాదేశిక నియోజకవర్గాల వివరాలు ప్రచురిస్తారు. నవంబరు 1, 2 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి 3న జాబితా ప్రచురిస్తారు. భూ యజమానుల ఓటరు జాబితాను నవంబరు 6 నుంచి 10 వరకు తయారు చేస్తారు. 12 వరకు అభ్యంతరాలు స్వీకరించి 13న తుది జాబితా విడుదల చేస్తారు. నవంబరు 21 నుంచి 23 వరకు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహణ, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 24 నుంచి 26 వరకు, ప్రాజెక్టు కమిటీలకు 27 నుంచి 29 వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

విజయవంతంగా విద్యాప్రవేశ్

కాట్రేనికోన: విద్యార్థుల్లో అభ్యాసన మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన విద్యాప్రవేశ్ 90 రోజుల కార్యక్రమం విజయవంతంగా సాగిందని సమగ్రశిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనారావు తెలిపారు. పల్లం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు మంగళవారం విద్యాప్రవేశ్ ఎండ్‌లైన్ పరీక్ష నిర్వహించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని పల్లం, చిర్రయానం, బ్రహ్మసమేధ్యం పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ ఏడాది జూన్‌లో బేస్‌లైన్ పరీక్షను, 90 రోజుల కార్యక్రమం అనంతరం మంగళవారం ఎండ్‌లైన్ పరీక్ష నిర్వహించారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, ఎంఈవో-2 ఎం.వెంకటరమణ, మీనాకుమార్, తేజేశ్వరి, నూర్జహాన్, భవాని, శిరీష తదితరులు పాల్గొన్నారు.


పరీక్షను పరిశీలిస్తున్న అధికారులు



ఎగిరొచ్చే అందం.. కోరింగతో బంధం

విదేశీ వలస పక్షుల రాకకు సమయం ఆసన్నం



● బ్లాక్ వింగెడ్ స్టిల్ట్



● ఇండియన్ స్కిమ్మర్

సంగీతం వినిపించినట్లు కిలకిలారావాలు.. ఆకాశానికి రంగేసినట్లు కనువిందు చేసే అందాలు. ఎగిసిపడే సముద్ర కెరటాల దగ్గర.. గలగలా పారే గోదావరి తీరాన.. దట్టమైన పచ్చదనం మధ్యంగాల విన్యాసాలు. ఎటుచూసినా కనుల విందే. శీతాకాలం ప్రవేశంతోనే కోరింగలో సందడి వాతావరణం నెలకొంటుంది. సంతానోత్పత్తి, ఆహార అన్వేషణలో భాగంగా వేల కిలోమీటర్లు దాటి ఏటా ఇక్కడికి చేరుకుంటాయి. కాకినాడ జిల్లా కోరింగ అభయారణ్యంలోని మడ అడవుల్లో ఆహారం లభించే చోట ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. ఆరునెలల పాటు ఉండి తిరిగి వెళ్తాయి.

– న్యూస్‌టుడే, తాళ్లరేవు

ఎల్లలు దాటి ప్రయాణం...

సైబీరియా, మంగోలియా, రష్యా, చైనా, ఒడిశాలోని మహానది, చంబల్ ప్రాంతాల నుంచి విదేశీ వలస పక్షులు కోరింగ అభయారణ్యానికి చేరుకుంటాయి. ఇప్పటికే ఐ.పోలవరం మండలం భైరవపాలెనికి ఇండియన్ స్కిమ్మర్ పక్షులు వచ్చాయి. నవంబరు నుంచి మార్చి వరకు ఈ అభయారణ్యంలోని 12 ప్రాంతాల్లో కనిపిస్తాయి. కోరింగలోని హోప్ ఐలాండ్, కాకినాడ ఏటిమొగ, కుంభాభిషేకం, బీచ్, బ్యాక్ వాటర్ కెనాల్, తాళ్లరేవు మండలం చొల్లంగి ఉప్పు మడులు, గాడిమొగ, కాట్రేనికోన మండలం సాంక్చరీ మెంట్, పండి, పోర, ఉప్పుల గుప్పం మండలం ఎస్.యానాం జి.కె.పోర ప్రాంతాల్లో విహరిస్తాయి.



జి.కె.పోర వద్ద వలస పక్షులకు అనువైన ప్రాంతం ఇదే. మడ అడవులు, చిత్తడి నేలలు వీటికి ఆహారం దొరికే ప్రాంతాలు.

ఆహార అన్వేషణ..



● రఫ్స్

సైబీరియా, మంగోలియా, రష్యా, చైనా వంటి దేశాల్లో పక్షులు ఉండే ప్రదేశాలు ఈ సీజన్‌లో మంచుతో కప్పేసి ఉంటాయి. ఆహార కొరత, ప్రతికూల పరిస్థితుల కారణంగా అక్టోబరు నుంచి మార్చి వరకు ఇక్కడికి చేరుకుంటాయి. నత్తలు, చేపలు, జూప్లాంక్టన్, వామస్ ఆహారాన్ని అధికంగా తింటాయి.

2024లో గుర్తించిన జాతులు: 108

కోరింగ అభయారణ్యం విస్తీర్ణం: 235.76 చ.కి.మీ.

పొడవు: 15 కిలోమీటర్లు

మడ అడవులు: 193 హెక్టార్లు

జనవరిలో గణన..

ఏటా జనవరిలో విదేశాల నుంచి వచ్చే పక్షులను లెక్కిస్తారు. ఇందులో వివిధ సంస్థలు పాల్గొంటాయి. ఒక్కో చోట అయిదుగురు చొప్పున 12 ప్రాంతాల్లో 12 బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక కెమెరాల ద్వారా పక్షులను గుర్తిస్తారు. 2011లో ప్రారంభమైన ఈ ప్రక్రియ ఏటా కొనసాగుతోంది. 2016 నుంచి పక్షుల సంఖ్య పెరుగుదల కనిపిస్తోంది. స్కిమ్మర్ అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేరడం గమనార్హం.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని పీడీఎఫ్ పూర్వ ఎమ్మెల్సీ ఫ్లోర్‌లీడర్ బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక కచేరిపేట యూటీఎఫ్ హోమ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డీఏల బకాయిలు పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపించకపోతే భవిష్యత్తులో ఉద్యమం తప్పదన్నారు. యూటీఎఫ్ కార్యాలయం పక్కనే ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని మరో చోటుకు మార్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయకర్, ఆవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీవీ నగేష్, తోటకూరి చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శి అన్నా రాము, ఎస్.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

నేడు నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు



అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న నందన

మసీదు సెంటర్(కాకినాడ): ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి టి.నందన మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల రోజున అభ్యర్థులు, ఓటర్లు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. అధ్యక్ష పదవి, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక జరగనుందన్నారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీజీహెచ్‌లోని రేడియాలజీ సెమినార్ హాలులో జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి తప్పనిసరిగా గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి వెంటనే ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

విద్యార్థులకు వీరగాథల పోటీలు

దేశభక్తి అంశాల ప్రాతిపదికన కార్యక్రమం

న్యూస్‌టుడే, రాజానగరం


కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వీరగాథ 4.0 పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా వీరగాథ పోటీలను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తోంది. ఈ పోటీలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రంతో పాటు ప్రోత్సాహక నగదు అందిస్తారు. రాష్ట్ర స్థాయి విజేతలకు జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు బహుమతిగా అందజేస్తారు.



తాము రూపొందించిన చిత్రాలతో విద్యార్థులు

నిర్వహించే అంశాలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ ఈ పోటీలలో పాల్గొంటున్నారు. 3-5 తరగతుల విద్యార్థులకు పద్యం, 150 పదాలకు మించకుండా ఒక కథ, చిత్రలేఖనం.. 6-8 తరగతుల విద్యార్థులకు పద్యాలు, చిత్రలేఖనంతో పాటు 300 పదాల కథ.. 9-10 తరగతుల వారికి పద్యాలు, చిత్రలేఖనం, 700 పదాల వ్యాసరచన.. 11-12 తరగతుల వారికి వెయ్యి పదాలతో వ్యాసరచన, పద్యాలు, చిత్రలేఖనం, వీటితో పాటు ఒకటి, రెండు నిమిషాల నిడివితో వీడియో ప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలు ప్రధానంగా దేశభక్తి, చరిత్ర ఆధారంగా ఉంటాయి.



వీర్‌గాథ 4.0 లోగో

విజేతల ఎంపిక ఇలా..

ప్రతి పాఠశాల నుంచి నాలుగు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురిని వీరగాథ 4.0 పోర్టల్‌లో నమోదు చేస్తారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో ఎంపికైన నలుగురిని రాష్ట్ర స్థాయికి, అక్కడ ప్రతిభ కనబరిచిన ఎనిమిది మందిని జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో ఒక్కో విభాగం నుంచి 25 మంది వంతున మొత్తం వంద మంది విజేతలను ఎంపిక చేస్తారు.

జిల్లా స్థాయిలో 17 నుంచి...

వీరగాథ 4.0 పోటీలు మండల స్థాయిలో ఇప్పటికే పూర్తికాగా ఈ నెల 17 నుంచి నవంబరు 10 వరకు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో నవంబరు 12 నుంచి 30 వరకు.. జాతీయ స్థాయిలో డిసెంబరు 4 నుంచి 24వ తేదీ వరకు ఈ పోటీలు జరుపుతారు.

సలహా కమిటీ సభ్యుడిగా రవి



కరప, న్యూస్‌టుడే: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కరప మండలం గురజానపల్లికి చెందిన గట్టి వెంకటేశ్వరరావు(రవి) నామినేట్ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సెక్షన్ అధికారి దినేష్ చంద్ర(రాజమహేంద్రవరం) మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, కాకినాడ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, వెల్డర్, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్ ట్రేడ్లలో అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఐటీఐ పూర్తిచేసిన ఆసక్తిగల అభ్యర్థులు www.apprenticeship-india.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు నవంబరు 8న ఉదయం 10 గంటలకు విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 08922-294906 నంబరులో సంప్రదించాలని కోరారు.

నా కుమారుడిని కుట్రపూరితంగా ఇరికించారు: విశ్వరూప్

రావులపాలెం పట్టణం: కుట్రపూరితంగా తన కుమారుడిని దళిత యువకుడి హత్య కేసులో ఇరికిస్తున్నారని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆరోపించారు. రావులపాలెం వైకాపా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం జరిగిన వాలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసు విచారణలో తాను కలుగజేసుకోలేదన్నారు. కోనసీమ అల్లర్ల విషయంలో పోలీసులు విచారణ చేసి దోషులను అరెస్టు చేశారన్నారు. నాటి పరిస్థితుల కారణంగా కేసులను అప్పటి ప్రభుత్వం ఉపసంహరించుకుందన్నారు. హత్యకు గురైన దుర్గాప్రసాద్ భార్యకి తాను రెండు ఎకరాల పొలం ఇస్తానని, కేసు ఉపసంహరించుకోవాలని చెప్పానంటూ మంత్రి సుభాష్ చెప్పడాన్ని ఖండిస్తున్నానన్నారు. తాను ఆమె వద్దకు వెళ్లినట్లుగాని, ఆమెతో మాట్లాడినట్లుగాని నిరూపించాలని డిమాండ్ చేశారు. కేసు ఉపసంహరించుకోవాలని ఎప్పుడూ చెప్పలేదన్నారు. కేవలం కుట్రపూరితంగా నిందితులకు నగదు ఇచ్చి తన కుమారుడి పేరు చెప్పించి ఇందులో ఇరికించారని ఆరోపించారు. నిర్దోషిగా బయటకు వస్తాడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి విశ్వరూప్

అయిదో విడత ఐటీఐల్లో ప్రవేశాలకు అవకాశం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు, కాకినాడ, జగ్గంపేట, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 సంవత్సరంలో ప్రవేశాల కోసం అయిదో విడత నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెండు జిల్లాల కన్వీనర్ ఎం.వి.జి.వర్మ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్లను తప్పనిసరిగా రెండు జిల్లాల్లో తమకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని సూచించారు. వీరికి ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వ ఐటీఐలలో 28వ తేదీన, ప్రైవేట్ ఐటీఐలలో 30వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

పర్యావరణ పరిరక్షణకు తొలి ప్రాధాన్యం

ప్రజాభిప్రాయ సేకరణలో ఓఎన్జీసీ ప్రతినిధులు

అల్లవరం, న్యూస్‌టుడే: ఓడలరేవు గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఓఎన్జీసీ చమురు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సముద్ర గర్భంలో నూతనంగా చమురు బావుల ఏర్పాటుకు సంబంధించి మంగళవారం గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ అధికారులు మాట్లాడుతూ కాకినాడ ఎస్సెట్ పరిధిలో బంగాళాఖాతం సముద్రంలో 10 బావులు, 2 మానవ రహిత ప్లాట్ ఫారమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాటి ద్వారా సహజ వాయువును వెలికితీసేందుకు రూ.4,600 కోట్లతో కొత్త ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రోజూ 5.031 మిలియన్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువు ఉత్పత్తి అంచనా వేస్తున్నామన్నారు. వీటి నుంచి సేకరించిన గ్యాస్‌ను సముద్ర గర్భం నుంచి 12 కి.మీ. మేర పైపులైన్ ఏర్పాటు చేసి ఓడలరేవులో ఉన్న వశిష్టటెర్మినల్‌కు చేరవేసి అక్కడ శుద్ధి చేసి గెయిల్ సంస్థకు అందజేయనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

రూ.100 కోట్లు కేటాయించాలి

అమలాపురం అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే ఆనందరావు కోరారు. ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకుని పూర్తిగా అభివృద్ధి చేయాలన్నారు. 40 ఏళ్లుగా కార్యకలాపాలు నిర్వహించి రూ.లక్షల కోట్ల వ్యాపారం నిర్వహిస్తున్నా స్థానిక ప్రాంతాల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పైపులైన్ల వల్ల సముద్ర గమనంలో మార్పులు చోటు చేసుకుని తీరం కోతకు గురవుతోందన్నారు. జేసీ నిశాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరు మండలం జొన్నాడలో ఇటీవల జరిగిన చోరీకి సంబంధించి ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అరెస్టు చేశారు. వారి నుంచి 121 గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేశారు. మంగళవారం ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సై అశోక్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు తన భార్య సీత ఆరోగ్యం క్షీణించడంతో పెద్ద కుమార్తె ఇంటివద్ద హైదరాబాద్‌లోనే నెల రోజులుగా ఉంటున్నారు. ఈ నెల 15న ఒక వేడుక నిమిత్తం బొబ్బర్లంక వచ్చిన సోమరాజు చిన్న అల్లుడు జానా మారుతీశివరామ్ జొన్నాడ వచ్చి కొన్ని బంగారు వస్తువులు తీసుకుని ఇంటికి తాళంవేసి వెళ్లారు. 17న పనిమనిషి వచ్చి ఇంటి పరిసరాలు శుభ్రం చేసేందుకు ఉపక్రమిస్తున్న సమయంలో ప్రధానద్వారం తెరిచి ఉండటంతో యజమానికి ఫోన్‌లో విషయం తెలియజేసింది. దీనిపై మారుతీశివరామ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. భీమవరానికి చెందిన పందిరి వెంకటనారాయణ అలియాస్ నారిగాడు, నెల్లూరుకు చెందిన షేక్ అహ్మద్ బాషాలను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరిద్దరూ రాత్రి సమయాల్లో తాళంవేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తులు. నారిగాడిపై 60 చోరీ కేసులు ఉన్నాయి. ఇతనికి 2019లో అహ్మద్‌బాషా జైలులో పరిచయమయ్యాడు. అప్పటినుంచి ఇద్దరూ కలిసి దొంగతనాలు చేస్తున్నారు. ఈ కేసు ఛేదించడంతో కృషి చేసిన ఎస్సై అశోక్ బృందాన్ని సీఐ ప్రశంసించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

గల్లంతైన విద్యార్థి మృతి



అభిషేక్ (పాత చిత్రం)

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: గోదావరిలో స్నానానికి దిగిన ఓ విద్యార్థి మృత్యువాత పడిన సంఘటన ఆత్రేయపురం మండలం నార్కెడుమిల్లి శివారు శెటిబలిజపాలెంలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 20న గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పిల్లి అభిషేక్(13) స్నేహితులతో కలిసి గోదావరిలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి కుటుంబీకులు గాలిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆదే ప్రదేశంలో మృతదేహం లభ్యమైంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విద్యార్థి తండ్రి రెండేళ్ల క్రితం చనిపోయాడు. తల్లి నాగలక్ష్మి 21 రోజుల క్రితం జీవనోపాధి నిమిత్తం దుబయ్ వెళ్లడంతో అమ్మమ్మ ఇంటివద్ద ఉండి చదువుకుంటున్నాడు. కుమారుడి మృతివార్త తెలియడంతో ఆమె హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ఒక్కగానొక్క కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉన్నత భవిష్యత్తు కల్పిద్దామనుకున్నాను నాన్నా.. ఇలా దూరమవుతావని అనుకోలేదని రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కలిచివేసింది.

ట్రాక్టరు ఢీకొని యువకుడి దుర్మరణం



బాలసుబ్రహ్మణ్యం (పాత చిత్రం)

రాయవరం, న్యూస్‌టుడే: అల్పాహారం చేసి ఇంటికి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన రాయవరం మండలం పసలపూడిలో మంగళవారం చోటు చేసుకుంది. రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబు వివరాల ప్రకారం పసలపూడికి చెందిన చిటికెన బాలసుబ్రహ్మణ్యం(21) మంగళవారం తెల్లవారుజామున రామచంద్రపురం నుంచి మోటార్‌సైకిల్‌పై గ్రామానికి చేరుకొంటున్న సమయంలో స్థానిక దేవిసెంటర్ మలుపు వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాలసుబ్రహ్మణ్యంను స్థానికులు రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే క్షతగాత్రుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. స్థానికులు వివరాల మేరకు.. మృతుడు 8వతరగతి వరకు చదివి.. ఆర్థిక ఇబ్బందులతో మానేసి వెల్డింగ్ పనులు చేసుకుంటున్నాడన్నారు. తల్లి హైదరాబాద్‌లో పనులు చేసుకుంటుండగా, తండ్రి సత్యనారాయణ కుటుంబాన్ని పట్టించుకోకుండా ఊబలంక వెళ్లిపోయినట్లు తెలిపారు. తాతయ్య మట్టా సుబ్బారావు, అమ్మమ్మ వద్దే మృతుని సోదరుడు కల్యాణ్ వెంకట కుమార్‌తో కలిసి ఉంటున్నారు. కాగా ప్రమాదానికి కారణమయ్యాడన్న ఆగ్రహంతో ట్రాక్టర్ డ్రైవర్‌ను మృతుని బంధువులు తీవ్రంగా కొట్టినట్లు సమాచారం.

విద్యార్థిని ఆత్మహత్యపై ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆలమూరు, న్యూస్‌టుడే: ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం వేధింపులు తాళలేక తన కుమార్తె(15) ఆత్మహత్యకు పాల్పడిందని చెక్కపల్లి బాబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆలమూరు ఎస్సై అశోక్ మంగళవారం తెలిపారు. పాఠశాల యాజమాన్యం దసరా సెలవులు ఇవ్వడం లేదని ఈ నెల 6న చరవాణిలో కలెక్టర్‌కు సందేశం పంపిందని, దాంతో యాజమాన్యం సెలవులు ఇచ్చిందన్నారు. సెలవుల అనంతరం యాజమాన్యం తన కుమార్తెతో నీవు పదోతరగతి ఉత్తీర్ణత పొందడం కష్టమని వ్యాఖ్యానించడంతో మనస్థాపానికి గురై ఈ నెల 18న ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థి మృతిపై విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని మంగళవారం పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన తెలిపారు.

వైకాపా హయాంలో దళితులపై హింసకు దుర్గాప్రసాద్ హత్యే నిదర్శనం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా దళితులను హింసించిందనడానికి, దళిత లీడర్లపై, సంఘాలపై అక్రమ అరెస్టులు చేయించిందనడానికి ఉదాహరణే 2022 జూన్ 6న జరిగిన వాలంటీర్ దుర్గా ప్రసాద్ హత్య అని తెలుగుదేశం పార్టీ నేత ఆకుమర్తి చిన్న మాదిగ ఆరోపించారు. రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు చిన్న మాదిగ తదితరులు విలేకరులతో మాట్లాడారు. హత్య చేయించినవారే పూలదండలు వేసి కేసుపై అనుమానం రాకుండా బాధితులను తప్పుదోవ పట్టించారన్నారు. దళిత బాధిత కుటుంబానికి ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ హత్య వెనుక ఎవరున్నారనేది విచారణ చేపడితే ఒక ముద్దాయి ధర్మేష్ ద్వారా అసలు విషయం బయటకు వచ్చిందన్నారు. దర్యాప్తులో పినిపే శ్రీకాంత్ అసలైన నిందితుడని తేలిందన్నారు. పోలీసు వారు కూడా మరింత లోతైన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని చిన్న మాదిగ కోరారు. సాటి దళిత బిడ్డని హత్య చేయించిన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుటుంబాన్ని వైకాపా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దొమ్మలపాటి రాజశేఖర్, దిగుమర్తి వీరబాబు, ఆకుమర్తి సూరిబాబు, కటకం సుబ్బారావు, పలివెల రాంబాబు, పలివెల భాస్కరరావు, కొమ్ము రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుమర్తి చిన్న మాదిగ, తదితరులు

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

విలీన ప్రక్రియ జీవోను అమలు చేయాలి: పీఆర్‌టీయూ

మామిడికుదురు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో తరగతుల విలీనానికి సంబంధించిన 117 జీవో రద్దు ప్రక్రియను వేగవంతంగా అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు అన్నారు. గోగన్నమఠం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మంగళవారం జరిగిన సంఘ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ నిధులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, హైస్కూల్ ప్లస్‌కు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయేతర పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, ఎం.అమృతరావు, మండల శాఖ అధ్యక్షుడు యాళ్ల పల్లంరాజు, కేవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు హాజరవ్వాలని వినతి

రాజోలు, న్యూస్‌టుడే: పౌర హక్కుల దినం సందర్భంగా ఈ నెలాఖరున జరిగే అవగాహనా సదస్సుకు మండల స్థాయి అధికారులంతా విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాజోలు తహసీల్దార్ ఎస్.ఎస్.ఎస్.ప్రసాద్‌కు మంగళవారం దళిత సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీవర్గాలు వివక్షకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత నెలలో సోంపల్లిలో జరిగిన సదస్సుకు అధికారులు హాజరు కాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్ర, జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలవనున్నట్లు తెలిపారు. బత్తుల మురళీకృష్ణ, మట్టా సురేష్‌కుమార్, తాడి సహదేవ్, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

చెత్త తొలగింపు

ర్యాలి గ్రామంలోని వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను గ్రామ కార్యదర్శి కృష్ణమాచార్యుల వద్ద ప్రస్తావించగా స్పందించి చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

వీధి దీపాలకు మరమ్మతులు

రావులపాలెం కొత్తకాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు. – న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

రక్షణ గట్ల నిర్మాణం

ఈనాడు కథనాలకు స్పందన

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేదిపల్లిపాలెంలో గోదావరి పోటెత్తి నీరు గ్రామాన్ని ముంచెత్తుతోందని ఈ నెల 21న 'ఈనాడు'లో 'పోటునీరు.. ముంచెత్తి పాట్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచి శ్రీను స్పందించారు. నీరు గ్రామంలోకి రాకుండా, రోడ్డుపై ప్రవహించకుండా రక్షణ గట్టు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆసుపత్రిలో సౌకర్యాల కల్పన



కొత్తపేట: 'మంచాలపై దుప్పట్లు లేవు డానే..' శీర్షికన ఈ నెల 21న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రోగులకు మంచాలపై దుప్పట్లు ఏర్పాటు చేశారు. గదుల్లో శానిటైజేషన్ చేశారు. దీంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తితిదే కల్యాణ మండపం అభివృద్ధికి చర్యలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురులో మూతపడిన తితిదే కల్యాణ మండపాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం పరిశీలించారు. దీనికి సత్వరమే మరమ్మతులు, ఆవరణలో అభివృద్ధి పనులు పూర్తిచేసి పునరుద్ధరణ జరిగేలా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడతానని చెప్పారు. మండపం పైకప్పునకు స్లాబు వేయాలని, లోకప్పును ఆధునికీకరించాలని, చుట్టూ పూడిక పనులు, రాకపోకలకు రోడ్డు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని స్థానిక నాయకులు ఆయనకు వివరించారు. ఈ-దర్శన్‌ను పునరుద్ధరించేలా చూడాలన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వంటింటి ఆనందం

• ఉచిత గ్యాస్‌తో తగ్గనున్న ఆర్థికభారం



– న్యూస్‌టుడే, సఖినేటిపల్లి, మలికిపురం

మహిళలకు వంటింటి భారాన్ని తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారు. దీనిలో భాగమే మరో హామీ ఉచిత గ్యాస్. దీనిని దీపావళి రోజున ప్రారంభిస్తామని, ఈ నెల 24 నుంచి సిలిండర్ బుక్ చేసుకోవచ్చని 31 నుంచి ఇస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. నిత్యావసర సరకులు భారం పెరిగిపోతున్న ప్రస్తుత రోజుల్లో ఉచిత గ్యాస్‌తో కొంత వెసులుబాటు కలుగుతుందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకు రూ.2628 ఆదా..

రాజోలు నియోజకవర్గంలోని సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల్లో సుమారు 40 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 1999లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రాయితీతో కూడిన దీపం పథకాన్ని తీసుకొచ్చారు. ప్రస్తుతం మహిళలకు ఇంటి ఖర్చును తగ్గించడానికి ఈ దీపావళి నుంచి ఉచిత గ్యాస్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.876 చొప్పున మూడు గ్యాస్ సిలిండర్లకు రూ.2,628 అర్హులైన లబ్ధిదారులకు ఆదా అవుతుంది.

ఎంతో మేలు చేశారు..



నిత్యావసర సరకుల ధరలు, ఇంటిఅద్దె కట్టుకోలేక సతమతమవుతున్న మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఎంతో మేలు చేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్థికభారం ఎంత ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చడం హర్షణీయం. ఇప్పుడు ఉచిత గ్యాస్ వల్ల మహిళలకు కొంత ఆర్థిక భారం తగ్గుతుంది. - మాగాపు విజయదుర్గ, గొల్లపాలెం

మాలాంటి పేదలకు ఉపయోగం



రెక్కాడితేగాని డొక్కాడని మాలాంటి పేదవాళ్లకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఒక వరం. ప్రస్తుత ధరకంటే ఇంటికి తీసుకొచ్చినందుకు మరో రూ.100 ఎక్కువ తీసుకుంటున్నారు. ధరలు పెరుగుపోతున్న ఈ రోజుల్లో ఉచిత ప్రకటన చేయడం చాలా సంతోషంగా ఉంది. - యడ్ల మేరీరత్నం, అంతర్వేది

అలరించిన విద్యార్థుల నృత్యం



రాజోలు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రాజోలు సీఐ టి.వి.నరేష్‌కుమార్ అన్నారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.సాయిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన తృతీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని పట్టుదలతో సాధించాలన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని నిరసన



అబ్కారీ సీఐకు ఇబ్బందులను చెబుతున్న స్థానికులు

మామిడికుదురు: పాశర్లపూడి పరిధి బొమ్మిడిపాలెంలో ఇళ్లకు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని దూరంగా తరలించాలని స్థానికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలించేందుకు అక్కడికి వచ్చిన అబ్కారీ సీఐ వీరబాబుకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను ఏకరువుపెట్టారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. స్థానికుల నుంచి వచ్చిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని సీఐ తెలిపారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు పరిశీలన

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీని పుల్లేటికుర్రులో నిరుపయోగంగా ఉన్న బీసీ బాలుర వసతిగృహంలో ఏర్పాటు చేసేందుకు ఉన్న పరిస్థితులను డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు మంగళవారం పరిశీలించారు. ఇక్కడి బీసీ బాలుర వసతిగృహంలో ముక్కామల పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచి జల్లి బాలరాజు కలెక్టర్‌తో పాటు వైద్యాధికారులకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాలతో ఈ వసతిగృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, ఉపసర్పంచి వీరా రవి, మాజీ సర్పంచులు అంది మూర్తి, కాండ్రేగుల గోపాలకృష్ణ, వార్డుసభ్యుడు డొమ్మేటి సురేష్ పాల్గొన్నారు.

వీరవల్లిపాలెం ఆసుపత్రి సందర్శన

అయినవిల్లి: వీరవల్లిపాలెం పీహెచ్‌సీని మంగళవారం జిల్లా అదనపు వైద్యాధికారి భరతలక్ష్మి సందర్శించారు. సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఈ పీహెచ్‌సీలో విధులు, సేవలపై సిబ్బంది అలసత్వం వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పేరుకే 24 గంటల ఆసుపత్రి అని, రాత్రి సమయంలో ఎవరూ విధులకు రావడం లేదని అంటున్నారు. ఆధునిక వసతులతో కూడిన ఆసుపత్రి ఉన్నప్పటికీ సక్రమంగా వైద్యసేవలు అందక ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవం.. భక్తిపారవశ్యం



శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన



అభిషేక క్రతువు



భద్రాచలం రాములోరి రథానికి స్వాగతం పలుకుతున్న బండారు శ్రీనివాసరావు, ఈవో చక్రధరరావు

ఆత్రేయపురం: గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్ర పరిసరాలు మారుమోగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండోరోజు మంగళవారం శ్రీనివాసుని సర్వసిద్ధిదేవ అలంకరణలో దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కోలాహలంగా సాగింది. ధర్మపథం వేదిక నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు అలరించాయి. భద్రాద్రి రాములోరి ఉత్సవ విగ్రహాలు ఆలయానికి చేరుకోవడంతో భక్తులు బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి పూజలు చేశారు. పరిసరాలన్నీ శ్రీరామనామ స్మరణతో ప్రతిధ్వనించాయి. రాములోరి రథానికి నియోజకవర్గ జనసేన బాధ్యుడు బండారు శ్రీనివాసరావు దంపతులు, మండల తెదేపా అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, లొల్ల సర్పంచి కాయల జగన్నాథం, ఈవో ఎన్‌ఎస్ చక్రధరరావు, పర్యవేక్షకుడు రాపాక శ్రీనివాస్ తదితరులు స్వాగతం పలికారు.



ఆకట్టుకున్న కాళికామాత వేషధారణ



హనుమంత వైభవం



వేంకటేశ్వరుని...

కళాశాల అధ్యాపకులకు మద్దతు

మలికిపురం: అధ్యాపకులకు జీతాలు ఇవ్వకుండా స్థానిక ఎమ్వీఎన్, జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల పాలకవర్గం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మండిపడ్డారు. జీతాల కోసం 42 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అధ్యాపకుల శిబిరాన్ని మంగళవారం సందర్శించిన ఆయన అధ్యాపకులకు మద్దతు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల సభ్యులు అధ్యాపకులకు న్యాయం చేయాలని పాలకవర్గాన్ని కోరుతున్నా ఇప్పటివరకు దిగి రాకపోవడం శోచనీయమన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి ఆదేశం

పి.గన్నవరం: ప్రభుత్వ పరంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగవంతంగా పూర్తి చేయాలని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మంగళవారం పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, ర.భ.శాఖ డీఈఈ రాజేంద్ర, అర్‌డబ్ల్యూస్ ఏఈ కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించరా...

మలికిపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు డిమాండు చేశారు. నాలుగు నెలలైనా ఇచ్చిన హామీని నెరవేర్చకుండా తాత్సారం చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం స్థానికంగా బస్సులో నిరసన తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సరెళ్ల ప్రసన్నకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీసెల్ కోఆర్డినేటరు చిలకపాటి శ్రీధర్, అల్లూరి మధురవిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్తికంలో భక్తులకు సౌకర్యాలపై నిర్ణయం

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఏకాదశరుద్రులు కొలువుదీరిన 11 శివాలయాల్లో రానున్న కార్తికమాసంలో భక్తులకు సకల ఏర్పాట్లు చేసేలా ఆయా గ్రామాల ప్రజలు, పెద్దలు, యువకులు కృషి చేయాలని మంగళవారం మొసలపల్లి భోగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. సోమవారాలు, పౌర్ణమి, మాసశివరాత్రి వంటి పర్వదినాల్లో వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల శివాలయాల కమిటీల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అధిక రసాయన ఎరువులు వాడొద్దు

అంబాజీపేట, న్యూస్‌టుడే: విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగించకుండా పంటలను సాగు చేయాలని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. పసుపల్లి, ఇరుసుమండ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు మట్టపర్తి నాగరాజు, అక్కిశెట్టి నాగమణి, ఏఈవో దంగేటి దుర్గారావు, ఉద్యానశాఖ విస్తరణాధికారి డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ఇలా..



ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తాగునీటి ట్యాంకు వద్ద పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. ఎప్పుడో నిర్మించి ట్యాంకు కావడంతో దానిపైన బల్లలు పక్కకు జరిగిపోవడంతో తాత్కాలికంగా ఫ్లెక్సీ కప్పారు. వర్షం వస్తే తాగునీరు కలుషితంగా మారడంతో పాటు పురుగులు, కీటకాలు ట్యాంకు లోపలికి చేరే అవకాశం ఉంది. మధ్యాహ్న భోజనం అనంతరం ఆ నీరే విద్యార్థులు తాగాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రధానోపాధ్యాయుడు గణేశ్వరరావు వద్ద ఈ విషయం ప్రస్తావించగా కొత్త ట్యాంకు ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

అధ్వానంగా పంటకాలువ



వేలాది ఎకరాలకు సాగు నీరందించే ప్రధాన పంట కాలువలపై జలవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అధ్వానంగా మారుతున్నాయి. భొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన కాలువలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో జలాలు కలుషితంగా మారడంతో పాటు ఎక్కడికక్కడ తూడుకు అడ్డుపడి సాగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతోంది. మడుపల్లి వద్ద పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

చెరువు కాదు.. రహదారే..



అంబాజీపేట గృహనిర్మాణ శాఖ కార్యాలయం ముందు ఉన్న రహదారి ఇది. కొర్లపాటివారిపాలేనికి వెళ్లే ఈ ప్రధాన రహదారి ఇప్పుడు చెరువును తలపిస్తోంది. రోజూ కురుస్తున్న వర్షాలకు ఈవిధంగా మారింది. ప్రజలు రాకపోకలను సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం రహదారిని మరమ్మతు చేయాలని వారు డిమాండు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

కొబ్బరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయడం ద్వారా బహుముఖ ప్రయోజనాలు చేకూరతాయని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మొండెపులంకలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పంటను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 మండలాలను కేటాయించిందని, నర్సరీల ఏర్పాటు ద్వారా మొక్కలు, ఇతర రాయితీలను రైతులకు అందజేస్తామని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయా మండలాల్లో 1,450 ఎకరాల్లో సాగు అవుతోందన్నారు. 3 వేల ఎకరాలకు విస్తరించగానే స్థానికంగా పరిశ్రమ నెలకొల్పేందుకు కార్యాచరణ జరుగుతుందన్నారు. సర్పంచి గుడాల రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉద్యానాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లేటికుర్రులో డ్వాక్రా మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న సంఘాల సభ్యులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంకు పరిధిలోని పలువురు డ్వాక్రాసంఘాల మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక యూనియన్ బ్యాంకులో కస్టమర్ పాయింట్ నెలకొల్పేందుకు ఇంటిగ్రా సంస్థ అనుమతి ఇచ్చింది. ఈ పాయింట్లో బ్యాంకు పరిధిలో ఉన్న 9 డ్వాక్రాసంఘాల సభ్యులు తాము తీసుకున్న రుణ మొత్తాల వాయిదాలను ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వాహకురాలు పరమట మణికి చెల్లించారు. ఆమె బ్యాంకుకు సక్రమంగా చెల్లించకపోవటంతో రూ.18 లక్షలు స్వాహా అయినట్లు గతంలోనే గుర్తించారు. ఈ నేపథ్యంలో కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలు మణి బ్యాంకు ఖాతాలో రూ.7 లక్షలు ఉన్నాయని. వీటిని నిలుపుదల చేశామన్నారు. మిగిలిన రూ.11 లక్షలు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని బ్యాంకుమిత్ర కోఆర్డినేటర్ ఎల్.నరేష్, ఏరియా మేనేజర్ కె.రఘుచందన్ తెలిపారు. సర్పంచులు జల్లి బాలరాజు, సరస్వతుల సుబ్రహ్మణ్యప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వడలి కృష్ణమూర్తి, డ్వాక్రాసంఘాల సభ్యుల సహకారంతో అంబాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వివరించారు. కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలితో పాటు బ్యాంకు అధికారులు, ఇంటిగ్రా సంస్థ ప్రతినిధులపై కూడా కేసులు నమోదు చేయాలని డ్వాక్రాసంఘ సభ్యులు డిమాండు చేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సఖినేటిపల్లి, రామేశ్వరం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అప్పనరామునిలంక, పల్లిపాలెంలలో వైద్యాధికారులు దుర్గాకావ్య, యూనస్‌లు క్షయ వ్యాధిపై అవగాహన సదస్సులు మంగళవారం ఏర్పాటు చేశారు. సర్పంచులు సుబ్బరాజు, ఒ.శ్రీను అధ్యక్షత వహించారు. దగ్గు, జ్వరం, కళ్లె పడటం, ఛాతీలో నొప్పి తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో 80 మందికి వైద్య పరీక్షలు చేశారు.

అక్రమ నీటి కనెక్షన్లు తొలగించకపోతే చర్యలు

మలికిపురం, న్యూస్‌టుడే: తాగునీటి పైపులైన్ల నుంచి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కనెక్షన్లు వెంటనే తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏవీఎస్ రాజన్, ఏఈ పీవీ సత్యనారాయణరాజు హెచ్చరించారు. రామరాజులంక పెదతిప్ప శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని ఇక్కడి ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు మంగళవారం వారిని కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో వేసిన పైపులైను నుంచి కూడా అక్రమ కనెక్షన్లు వేయడంతో తాగునీరు అందడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన అధికారులు అక్రమ కనెక్షన్లు తొలగించాలని కోరారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచి కాకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ దొంగలతో బేజార్

రావులపాలెం గ్రామీణం, పట్టణం: రావులపాలెం రైతుబజారుకి నిత్యం కూరగాయలు కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున జనం వస్తుంటారు. వారిలో కొందరు సైకిళ్లపై వస్తుండగా కొందరు చోరులు వాటిని అపహరించుకుపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, ఎస్టేట్ అధికారులు స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు కాపలాదారుని నియమించి సైకిల్ దొంగతనాలు అదుపు చేయాలని కోరుతున్నారు.

కొట్లాటపై కేసుల నమోదు

మామిడికుదురు: మగటపల్లిలో రెండేళ్ల క్రితం జరిగిన ప్రేమపెళ్లి నేపథ్యంలో తాజాగా రెండు కుటుంబాల మధ్య దారితీసిన కొట్లాటలకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు నగరం ఎస్సై చైతన్యకుమార్ మంగళవారం తెలిపారు. తన కుమార్తె పుట్టినరోజు వేడుక పిలుపు చెప్పేందుకు వెళ్తున్న తనపై సరెళ్ల సాయితేజతో పాటు మరో ఆరుగురు ఇనుపరాడ్లు, కర్రలతో దాడిచేసి గాయపరిచారని కలిగితి దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేశారన్నారు. తాను ఇంటికి వెళ్తుండగా దుర్గాప్రసాద్ తనను అడ్డగించి కొడవలితో తలపై గాయపరిచాడని, మరో నలుగురు కిందపడేసి కొట్టారని సాయితేజ పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు చెప్పారు. రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. దుర్గాప్రసాద్‌ను మానవహక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, బీఎస్పీ రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం పరామర్శించారు. దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

భయపెడుతున్న గ్రామసింహాలు



– న్యూస్‌టుడే, కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్రామసింహాలు గుంపులు గుంపులుగా ఉంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏళ్లతరబడి వీటిని అరికట్టేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మహిళలు, చిన్నపిల్లలు కుక్కకాటుకు గురవుతున్నారు. గడిచిన ఐదేళ్లలో వాటికి కుటుంబ నియంత్రణ టీకాలు వేయకపోవడంతో వాటి సంతతి విపరీతంగా పెరిగిపోయింది. కొత్తపేట పట్టణం, బ్యాంకుకాలనీ, కొప్పిశెట్టివారి వీధి, రావులపాలెం పట్టణం, కొమరాజులంక, రావులపాడు, ఈతకోట, ఆలమూరు, పెదపళ్ల, జొన్నాడ తదితర గ్రామాల్లో కుక్కల సంఖ్య అధికంగా ఉంటోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సత్వర నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తపేటలో కుక్కలు

పీహెచ్‌సీల పరిధిలో కేసుల నమోదు వివరాలిలా..

నెల	అవిడి	వానపల్లి	కొత్తపేట
జనవరి	12	20	123
ఫిబ్రవరి	15	12	106
మార్చి	18	25	79
ఏప్రిల్	21	18	76
మే	22	10	88
జూన్	20	20	83
జులై	10	08	72
ఆగస్టు	11	12	58

రేబిస్ టీకా అందుబాటులో ఉంది

కుక్కకాటుకు వెంటనే వైద్యం తీసుకోవాలి. లేకపోతే ప్రాణాలకు ప్రమాదం. రేబిస్ వ్యాక్సిన్ ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ అందుబాటులో ఉంది. నాటు వైద్యానికి వెళ్లరాదు. - దుర్గాప్రసాద్, కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

27న చెకుముకి పోటీలు

మలికిపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి పోటీలు ఈ నెల 27న మలికిపురం ఎమ్వీఎన్, జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు వేదిక మలికిపురం మండల శాఖ అధ్యక్షుడు పీవీవీ ప్రసాద్ మంగళవారం చెప్పారు. ఇప్పటికే మండలస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన బృందాలను 27 ఉదయం 7 గంటలకే పరీక్ష కేంద్రాలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

స.హ. చట్టంపై సదస్సు

కొత్తపేట: పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందని వ్యవసాయాధికారి పద్మలత అన్నారు. కొత్తపేట పంచాయతీ పరిధిలో రైతులకు సర్పంచి భూసి జయలక్ష్మి భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం స.హ.చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతివ్యక్తి ఈ చట్టం ద్వారా తమకు కావాల్సిన సమాచారం తీసుకునే హక్కు ఉందన్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆధార్ శిబిరాలు

రావులపాలెం పట్టణం: మండలంలో బుధవారం ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో మహేష్ అన్నారు. గోపాలపురం, దేవరపల్లి, రావులపాలెం, ఊబలంక పంచాయతీ కార్యాలయాల్లో వీటిని నిర్వహిస్తున్నామన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

24న విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం డివిజన్, సబ్‌డివిజన్ పరిధిలో ఈ నెల 24న విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఛైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి డా.వి.సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అమలాపురంలోని సబ్‌డివిజన్ కార్యాలయంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యలపై ఫిర్యాదులను సీజీఆర్ఎఫ్ కమిటీకి అందించవచ్చునన్నారు.

రూ.33.47 లక్షలు మంజూరు

యానాం, న్యూస్‌టుడే: యానాం, కారైకాల్ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవల నిమిత్తం రూ.33.47 లక్షలు మంజూరు చేసినట్లు పుదుచ్చేరి ఆర్థిక శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

వరదబాధితులకు రూ.లక్ష విరాళం


చంద్రబాబుకు చెక్కు అందిస్తూ..

ఉప్పలగుప్తం: ఇటీవల తుపాను వరదలకు నష్టపోయిన కుటుంబాలకు అమలాపురం పట్టణానికి చెందిన సర్ సీవీ రామన్ పాఠశాల యాజమాన్యం రూ.లక్ష విరాళం అందించింది. మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు సహాయం అందించడం సామాజిక బాధ్యత అన్నారు. చంద్రబాబు వేణుగోపాలరావును అభినందించారు.

అంతర్జాలంపై అవగాహన పెంచుకోవాలి


పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


విజేతలతో ప్రిన్సిపల్ లక్ష్మీగణేష్, వైస్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి

అమలాపురం గ్రామీణం: విద్యార్థులు అంతర్జాలంపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీరామ పాఠశాల ప్రిన్సిపల్ పురాణపండ లక్ష్మీగణేష్ పేర్కొన్నారు. సమనసలోని శ్రీరామ పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్షలు నిర్వహించారు. అంతర్జాల వినియోగంతో కలిగే లాభాలు, నష్టాలు, సామాజిక మాధ్యమ ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో వరుసగా ఆకుల యజశ్రీలక్ష్మీశిరీష, కె.హెన్సిల్, వి.వినోద్‌కుమార్ నిలిచారు. అనంతరం విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ పి.నాగలక్ష్మి, కరస్పాండెంట్ పి.సరస్వతీదేవి అందించారు.

మరింత చేరువలో రేషన్ సరకులు

డివిజన్‌లో 34 కొత్త దుకాణాల ఏర్పాటుకు చర్యలు


రేషన్ దుకాణం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా పంపిణీ (పీడీఎస్) వ్యవస్థలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉచిత బియ్యం, ఇతర వస్తువులు అందజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రేషన్ దుకాణాల్లో కార్డుల సంఖ్య ఒక్కోచోట ఒక్కో రకంగా ఉండటం.. ఏళ్ల తరబడి అలాగే కొనసాగిస్తున్న తరుణంలో.. ఇటీవల కార్డుల విభజన ప్రక్రియను చేపట్టి కొత్తగా రేషన్ దుకాణాలు ఏర్పాటుకు ప్రక్రియను పూర్తి చేశారు. అమలాపురం డివిజన్‌లో కొత్తగా ఏర్పడే దుకాణాల వివరాలను పౌరసరఫరాల శాఖ అధికారులు సిద్ధం చేశారు. త్వరలో ఆర్డీఓ ద్వారా నోటిఫికేషన్ వెలువడనుంది.

అందుబాటులో ఉండే విధంగా..

వైకాపా ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసింది. ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ పేరుతో ఎండీయూలను తీసుకువచ్చింది. దీనికి పెత్తఎత్తున ప్రజాధనం ఖర్చు చేసి.. ఆ పార్టీ అనుయాయులకు వాహనాలను కట్టబెట్టింది. అమలాపురం డివిజన్‌లో రూ.7.84 కోట్లతో 150 ఎండీయూలను సమకూర్చారు. వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక కార్డుదారులు పనులు మానుకుని ఇళ్ల వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విభజన ఇలా..

అమలాపురం డివిజన్‌లో 333 రేషన్ దుకాణాల పరిధిలో 1.92 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేశారు. కొన్నిచోట్ల 400 లోపు, మరికొన్నిచోట్ల 800కు పైగా ఉన్నాయి. అమలాపురం పురపాలక, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు రేషన్ దుకాణాల్లో 900కు పైగా, 350 కంటే తక్కువ చాలాచోట్ల ఉన్నాయి. ఈ క్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ దుకాణాల వారీగా కార్డుల సంఖ్య ఆధారంగా విభజన ప్రక్రియను పూర్తి చేశారు. తక్కువ రేషన్ కార్డులు ఉన్నచోట్ల పక్క దుకాణాల్లో సర్దుబాటు చేశారు. అమలాపురం డివిజన్‌లో 800కు పైగా కార్డులు ఉన్న 34 రేషన్ దుకాణాల్లో కార్డులను రెండుగా విభజించారు. అక్కడ కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. వీటితో పాటు మరో 35 రేషన్ దుకాణాలు ఇన్‌ఛార్జులతో నడుపుతున్నారు. 6ఎ కేసులు ఇతరత్రా కారణాలతో సదరు డీలర్ల నుంచి ఇన్‌ఛార్జులకు బాధ్యతలు అప్పగించారు. వీటిని వైకాపా పాలనలో ఆ పార్టీ అనుయాయులకే అప్పగించారు. ఇప్పుడు వీటికి డీలర్లను నియమించనున్నారు.

ఆర్డీవోల ద్వారా నియామకాలు

జిల్లాలో రేషన్ కార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేసి కొత్త రేషన్ దుకాణాలను గుర్తించాం. 800కు పైగా ఉన్న రేషన్ దుకాణాల్లో కార్డులను రెండు దుకాణాలు ఏర్పాటు చేసే సర్దుబాటు చేశాం. వీటికి సంబంధించిన విభజన ప్రక్రియ పూర్తి చేసి జిల్లా సంయుక్త కలెక్టర్‌కు అందజేశాం. ఆర్డీఓ ద్వారా రోస్టర్ విధానాన్ని అనుసరించి నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపడతారు.

– ఉదయ్‌భాస్కర్, జిల్లా పౌరసరఫరాల అధికారి

విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురంలోని మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 200 మందికి అప్పిరెడ్డి రామదాసు ఫౌండేషన్(ట్రస్టు) ప్రతినిధులు మంగళవారం ఉచితబస్సు పాసులు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ట్రస్టు సభ్యులు ఆకాంక్షించారు. జంగా శేషు, అప్పిరెడ్డి మహేష్, అప్పిరెడ్డి మూర్తి, గుత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలెండర్లు స్వాధీనం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బట్నవిల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన గృహ వినియోగ గ్యాస్ సిలెండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బట్నవిల్లికి చెందిన బలభద్ర మల్లికార్జునరావు ఇంట్లో 9, బలభద్ర పాపారావుకు చెందిన దుకాణంలో 8 సిలెండర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి స్నేహిత మాట్లాడుతూ అక్రమంగా గృహ వినియోగ సిలెండర్లు నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు బహుమతులు


అందజేసిన వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి

యానాం: యానాంలోని శారదా విద్యానికేతన్ పూర్వ విద్యార్థిని చిక్కాల లక్ష్మీసునంద జ్ఞాపకార్థం తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మిలు పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లక్ష్మీసునంద మెమోరియల్ అవార్డులు అందజేశారు. పాఠశాలలో 6-10వ తరగతి వరకు ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు రూ.2 వేలు చొప్పున నగదు బహుమతి, జ్ఞాపిక అందజేశారు. పీఈటీ చింతా వెంకన్న, కందుకూరి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం వినియోగంపై అవగాహన

యానాం: ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలని యానాం సీఐ షణ్ముగం సూచించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద శిరస్త్రాణం వినియోగంపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సైలు మురుగనందన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల సమావేశం

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు కొయ్యల దుర్గారావు అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పట్టణ జీవనోపాదుల పథకంలో చిరు వ్యాపారులకు ఉపాధి నిమిత్తం చేయూత అందించనున్నట్లు సీపీ నాగ రాజేశ్వరి వివరించారు. కార్యక్రమంలో కె.రామ్మూర్తి, ఎం.రాంబాబు, సాయిబాబు, తాడాల సుబ్బారావు, భాస్కరరరావు తదదితరులు పాల్గొన్నారు.

పార్టీ జెండాల ఆవిష్కరణ



ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: సరిపల్లిలో తెదేపా, జనసేన స్తూపాలను, జెండాలను ఎమ్మెల్యే ఆనందరావు, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీలు మంగళవారం ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి పార్టీల బలోపేతానికి కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన పలువురుని కండవాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమ, అరిగెల నానాజీ, ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం సుధ, ఆకుల బుజ్జి, గెడ్డం సత్యనారాయణ, చవటపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోవాలి


మెట్లకాలనీలో నమోదుకు వేచి ఉన్న నగరవాసులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురంపట్టణంలో పలు ప్రాంతాల్లో ఈ నెల 25 వరకు నిర్వహించనున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు కోరారు. మెట్లకాలనీలో నిర్వహించిన ఆధార్ శిబిరంలో సిబ్బంది పనితీరును మంగళవారం ఆయన పర్యవేక్షించారు.


సమావేశంలో పాల్గొన్న వైకాపా నాయకులు

'విశ్వరూప్‌పై రాజకీయ కుట్ర'

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి విశ్వరూప్ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి రాజకీయకుట్ర పన్నుతున్నారని పలువురు వైకాపా నాయకులు పేర్కొన్నారు. ఉప్పలగుప్తంలో పార్టీ నాయకులతో మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేయలేక ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మాజీ మంత్రి కుమారుడిని కేసులో ఇరికించారని వారు ఆరోపించారు. బద్రి బాబ్జి, కడిమి చిన్నవరాజు, డి.రాంబాబు, పినిపే జయరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని దేహశుద్ధి


స్తంబానికి కట్టేసిన దృశ్యం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్లలోని జాతీయ రహదారిపై ఇంటర్ చదువుతున్న విద్యార్థిని పట్ల ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశనకుర్రుకు చెందిన చింతా వెంకటేశ్వరరావు సోమవారం సాయంత్రం రోడ్డుపై నడిచి వెళ్తొన్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని స్థానికులు దాడి చేశారు. అతడిని స్తంభానికి కట్టేసి పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎస్సై మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ అతడు విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించలేదన్నారు. ఆ విద్యార్థినితో మాట్లాడగా ఈ మేరకు చెప్పినట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేయలేదని ఎస్సై వివరించారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా పలుగ్రామాల్లో ఉపాధి నిధులతో నిర్మించే సీసీ రహదారుల పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కూనవరంలో రూ.8 లక్షలు, గోపవరంలో రూ.12 లక్షలు, చల్లపల్లిలో రూ.20 లక్షలు, సరిపల్లిలో రూ.8 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి రుద్రహోమం



ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రుద్రహోమం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హోమం చేశారు.



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం: పళ్లవారిపాలెంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి కృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అలంకరణ చేసి సింధూర అర్చన చేశారు.

మురుగుకాలువపై నిర్మాణ సామగ్రి


మున్సిపల్ కార్యాలయం ఎదురుగా..

అమలాపురం పట్టణం: పురపాలక కార్యాలయం ఎదురుగా ఒక దుకాణ సముదాయం నిర్మాణం చేపడుతున్నారు. అక్కడి కాలువపై నిర్మాణ సామగ్రి వేయడంతో మురుగు నిలిచిపోయిందని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు ఎదురుగా ఉన్నా పట్టించుకోకపోవడంతో స్థానికులు వాపోతున్నారు.

తీగలు తొలగించరూ..!



కాట్రేనికోనలోని రామస్వామి తోటలో ఓ విద్యుత్తు స్తంభం చుట్టూ తీగజాతి మొక్క అల్లుకుపోయింది. అక్కడ ఏర్పాటు చేసిన వీది దీపం నుంచి వెలుతురు రావడం లేదు. స్తంభంపై తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: అమలాపురంలోని కాలేజీరోడ్డుకు వెళ్లే దారిలో చెత్త పడవేస్తున్నారు. వీపరితమైన దుర్వాసన వస్తుంది. ఇక్కడ చెత్త వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రావణి, గృహిణి

స్పందనకు వందనం

సమస్య: అమలాపురంలోని కె.అగ్రహారం భోగరాజువీధిలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో దోమలతో ఇబ్బంది పడుతున్నాం. వీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలి.

– నాగేశ్వరరావు, స్థానికుడు

పరిష్కారం: స్థానిక కాలేజీరోడ్డుకు వెళ్లే దారిలో చెత్త, భోగరాజువీధిలో పిచ్చిమొక్కల సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. వాటిని సిబ్బందితో తొలగించారు. - న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

శ్రీకాంత్ తరలింపులో ఉత్కంఠ

కొత్తపేట డీఎస్పీ కార్యాలయానికి తీసుకువచ్చిన పోలీసులు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అయినవిల్లికి చెందిన దళిత యువకుడు, వాలంటీరు దుర్గాప్రసాద్ హత్యకేసులో ప్రధాన సూత్రధారి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడైన శ్రీకాంత్‌ను మంగళవారం జిల్లాకు తీసుకొచ్చే క్రమంలో ఉత్కంఠ నెలకొంది. తమిళనాడులోని మధురైలో ఆదివారం రాత్రి అరెస్టు చేసిన తరువాత రోడ్డు మార్గంలో ఇక్కడకు తీసుకొచ్చేందుకు ఆలస్యమైంది. ఆయన జాడ ఎవరికీ తెలియకుండా పోలీసులు గోప్యత పాటించారు. ఏ మార్గంలో వస్తున్నారు? ఎక్కడికి తీసుకువస్తారు? కోర్టుకు ఏ సమయానికి హాజరుపరుస్తారన్న విషయాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మధురై నుంచి తీసుకొస్తున్న క్రమంలో ఆయనను విచారించినట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో కొత్తపేట డీఎస్పీ కార్యాలయానికి తీసుకువచ్చారు. అక్కడ నిబంధనల మేరకు దస్త్రాల పని పూర్తిచేసి, అమలాపురంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.


అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద మంగళవారం రాత్రి వైకాపా శ్రేణులు

మోహరించిన వైకాపా శ్రేణులు

పినిపే శ్రీకాంత్‌ను తొలుత రావులపాలెం సర్కిల్ కార్యాలయం, కొత్తపేట డీఎస్పీ కార్యాలయానికి అనంతరం అమలాపురం తీసుకెళ్తారన్న ప్రచారం జరిగింది. మంగళవారం ఉదయం నుంచే మీడియా, కొందరు వైకాపా నాయకులు ఆయా ప్రాంతాలకు చేరుకోవడంతో హడావుడి నెలకొంది. సాయంత్రం 4 గంటల నుంచి అమలాపురం కోర్టు ఆవరణ, ఏరియా ఆసుపత్రి వద్దకు వందల సంఖ్యలో వైకాపా శ్రేణులు చేరుకున్నాయి. దీంతో ఒకింత ఆందోళన నెలకొంది. పోలీసులు బందోబస్తుతో అప్రమత్తమయ్యారు. చివరకు అర్ధరాత్రి తీసుకువస్తారన్న ప్రచారం జరగడంతో వెనుదిరిగారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఐ.పోలవరం: ఎదుర్లంక వారధిపై గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. 55-60 ఏళ్ల మధ్య వయసు కలిగి తెలుపు రంగు చొక్కా, ముదురు నాచురంగు ప్యాంటు, చేతికి టైటాన్ వాచ్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఐ.పోలవరం ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు.

గోదావరిలో లభ్యం..

కాట్రేనికోన: కుండలేశ్వరం గోదావరిలో మంగళవారం మృతదేహం లభ్యమైందని కాట్రేనికోన పోలీసులు తెలిపారు. కాకినాడకు చెందిన కాకర్ల ప్రసాదరావు రెండురోజుల క్రితం కనిపించడం లేదని కుటుంబసభ్యులు ఇంద్రపాలెం పోలీసుస్టేషనులో ఫిర్యాదు ఇచ్చారన్నారు. గోదావరిలో మృతదేహం కనిపించడంతోపాటు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, అక్కడి పోలీసులు వచ్చి మృతదేహాన్ని కాకినాడకు తీసుకువెళ్లారన్నారు.

కుక్క అడ్డురావడంతో గాయాలు

కాట్రేనికోన: ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో కాట్రేనికోనలోని అడవిపేటకు చెందిన సుదర్శనరావు గాయాలపాలయ్యాడు. హైదరాబాద్ బస్సు ఎక్కేందుకు మంగళవారం సుదర్శనరావు మరొకరితో కలసి వెళ్తుండగా చిలకమ్మచెరువు సమీపంలో కుక్క అడ్డురావడంతో కిందపడదంతో అతని కాలు విరిగింది. చికిత్సకై ఆసుపత్రికి తరలించారని స్థానికులు తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

యానాం, న్యూస్‌టుడే: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పుదుచ్చేరి న్యాయశాఖ కార్యదర్శి డా.ఎల్ఎస్ సత్యమూర్తి అన్నారు. యానాం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో సబ్‌కోర్టు న్యాయమూర్తి రాజమోహన్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో దుర్గాశ్రీనివాస్, నటరాజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: పుదుచ్చేరి న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తి యానాంలో పర్యటించారు. శిధిల స్థితిలో ఉన్న సబ్‌కోర్టు భవనాన్ని పరిశీలించారు. న్యాయమూర్తి రాజ్‌మోహన్‌తో కలిసి తాత్కాలిక కోర్టుగా ఏర్పాటు చేయనున్న మున్సిపల్ కళ్యాణ మండపాన్ని పరిశీలించి. నవంబరు 15 తర్వాత కోర్టును కల్యాణ మండపంలోకి మార్చాలని సూచించారు. యానాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయనను ఎస్పీ రాజశేఖరన్ సత్కరించారు.


మాట్లాడుతున్న న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తి

గోడపత్రిక ఆవిష్కరణ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే సంస్కృతీ ఉత్సవ్ 2024 పోటీలకు సంబంధించిన గోడపత్రికను అమలాపురం పట్టణం 2వ వార్డు కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబరు 8, 9, 10 తేదీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పోటీలు నిర్వహిస్తామని సంస్థ ఛైర్మన్ అకొండి పవన్ తెలిపారు. కార్యక్రమంలో రవీంద్ర, ప్రసాద్, బాబి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

యానాం, న్యూస్‌టుడే: యానాం శివారు దొమ్మేటిపేట కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ముమ్మిడివరం వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ ఛైర్మనన్ కుడిపూడి శివన్నారాయణ, గుత్తుల రామారావు, దంగేటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో..?



అమలాపురం మండలం సవరప్పాలెంలోని గ్రంథాలయ భవన నిర్మాణం నిలిచిపోయింది. నిధులు చాలక పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం అద్దె భవనంలో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

వంతెన.. ప్రమాదం అంచున..!



అమలాపురం మండలం వన్నెచింతలపూడి నుంచి తాండవపల్లి వెళ్లే మార్గంలో మురుగుకాలువపై ఉండే వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. వంతెనకు ఓపక్క రక్షణ గోడ విరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వంతెనకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

పూడికతో కాలువలు.. గుంతలతో రహదారులు

నగర పంచాయతీలో మౌలిక వసతుల లేమితో ఇక్కట్లు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

నియోజకవర్గ ప్రధాన కేంద్రం, నగర పంచాయతీ ముమ్మిడివరం మౌలిక వసతుల సమస్యలతో కొట్టిమిట్టాడుతోంది. అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ, ఛిద్రమైన రహదార్లు, పూర్తి స్థాయిలో అందని తాగునీటితో జనం అవస్థలు పడుతున్నారు. నగరంలోని 20 వార్డుల్లో 25వేల మంది జనాభా ఉన్నారు. కొంత వరకు సిమెంటు రహదారులు నిర్మించినా శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మల్లాయపాలెం, మట్టాడిపాలెం, సూరాయిచెరువు, పైగోడిమెరక, అంబేడ్కర్ నగర్, బొండాయకోడుతూము, చవుడుపేట, క్రాపచింతలపూడి, సోమిదేవరపాలెం, చింతలమెరక తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదార్లు ఛిద్రం కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

అస్తవ్యస్తంగా మురుగుకాలువల వ్యవస్థ..


ముమ్మిడివరంలో..

మురుగుకాలువల వ్యవస్థ సక్రమంగా లేదు. సిమెంటు రోడ్లు నిర్మించినా చాలా చోట్ల డ్రెయిన్లు లేవు. గతంలో నిర్మించిన మురుగుకాలువలు ఛిద్రం కావడం, వీటి ద్వారా మురుగు బయటకు వెళ్లే అవుట్‌లెట్‌లు మూసుకుపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. వైకాపా పాలనలో నగర పంచాయతీ 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో పలు వార్డుల్లో రహదార్ల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదంతో చర్యలు తీసుకున్నారు. వాటికి టెండర్లు పిలిచినా.. బిల్లులు వస్తాయో.. రావోనని.. గుత్తేదారులు ముందుకురాలేదు.

రాయుడువారిపాలెంలో రహదారిలో ప్రజల ఇక్కట్లు



తాగునీటికీ ఇక్కట్లే..

పలు వార్డుల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. ఇక్కడి తాగునీటి ప్రాజెక్టు నుంచి పూర్తి స్థాయిలో నీరు అందడం లేదు. తాగునీటి ప్రాజెక్టుకు ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐబీ) నిధులు రూ.110 కోట్లు విడుదలైనా గత ప్రభుత్వంలో ఆ పనులు ముందుకు సాగలేదు.

రహదారుల నిర్మాణానికి చర్యలు

నగర పంచాయతీ పరిధిలో రహదారుల మరమ్మతులకు కౌన్సిల్ ఆమోదం మేరకు చర్యలు చేపట్టాం. ఇతర మౌలిక వసతుల కల్పనకు అంచనాలు రూపొందించాం. తాగునీటి విషయంలో ఏఐబీ నిధులతో చేపట్టిన ప్రాజెక్టుకు గడువు పెంచడంతో పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంది.

– సత్యనారాయణ, ఏఈఈ, ముమ్మిడివరం నగర పంచాయతీ

మండపేట
• మండపేట • రామచంద్రపురం

నైపుణ్య శిక్షణకు కోడ్ నెక్స్టాతో ఒప్పందం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ టీకెవి శ్రీనివాసరావు

మండపేట: ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థుల నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కోడ్ నెక్స్టాతో ఒప్పందం చేసుకున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టీకెవి శ్రీనివాసరావు తెలిపారు. తమ కళాశాలలో చదివే బీకాం, బీఏ, బీఎస్సీ చదివే విద్యార్థులకు కోడ్ నెక్స్ట్ సంస్థ కంప్యూటర్, ఏఐ సాంకేతికతపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

పామర్రు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గొర్రెలు, మేకల్లో నట్టల తెగులు కనబడుతుంటుందని, దీని నివారణకు మందును ఉచితంగా పంపిణీ చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని దంగేరు పశువైద్యాధికారి కె.వి.రామారావు వెల్లడించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో గ్రామంలోని 400 గొర్రెలు, 200 మేకలకు సంబంధించి ఈ మందు పంపిణీ జరిగింది. గ్రామ సర్పంచి కొప్పిశెట్టి వెంకటరమణ వాటికి మందు ద్రావణం తాగించి కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు కె. లక్ష్మణ్, స్థానిక రైతులు, పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రులు పాల్గొన్నారు.


దంగేరులో మేకలకు నట్టల వ్యాధి నివారణ మందును వేస్తున్న సర్పంచి కె.వి.రమణ

నాణ్యమైన మొక్కలు.. సరసమైన ధరలు

ఈ విద్యార్థులు రోడ్డు పై మొక్కలను పట్టుకుని నిలబడ్డారేంటని అనుకుంటున్నారా.. వారంతా కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు. రామచంద్రపురం-ద్రాక్షారామ రోడ్డులో వారి కళాశాల ఎదుట అప్పుడప్పుడు ఇలా నాణ్యమైన మొక్కలను తక్కువ ధరకే విక్రయిస్తూ ఉంటారు. ఎందుకంటే వారి శిక్షణలో భాగంగా మొక్కలను ప్రయోగాత్మకంగా పెంచి వాటిని తక్కువ ధరకే విక్రయిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ ఉంటారు. దీనిలో భాగంగానే మంగళవారం మధ్యాహ్నం రోడ్డుపై విద్యార్థులు మొక్కలను విక్రయించారు. ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. **- న్యూస్‌టుడే, రామచంద్రపురం**


ప్రయాణికులకు మొక్కలను చూపిస్తూ విక్రయిస్తున్న బాలికలు

ఈ-ఆటో రోడ్డెక్కదు

మండపేట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండపేట మున్సిపాలిటీకి అందించిన 10 ఈ ఆటోలు రోడ్డు ఎక్కే పరిస్థితులు కనపడటం లేదు. ఈ సంవత్సరం సార్వత్రిక ఎన్నికల ముందు ఫిబ్రవరి నెలలో ఆటోలు ఆదరాబాదరాగా మండపేట పంపించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో వాటిని పట్టించుకునే తీరిక లేక గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో ఉంచారు. ఆటోలు వచ్చి 9 నెలలు కావస్తున్నా వాటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో నిరుపయోగంగా మారడంతోపాటు వర్షాలకు తుప్పు పడుతున్నాయి.

పట్టణం పరిశుభ్రంగా ఉంచాలనే ఆలోచన..

పట్టణంలో 30 వార్డుల 14 సచివాలయాల పరిధిలో 10 ఈ ఆటోలు సరఫరా చేశారు. వీటి ద్వారా తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తారు. అక్కడ రీసైక్లింగ్ వ్యర్థాలను వేరు చేస్తారు. ఈ విధంగా ఎప్పటికప్పుడు వ్యర్థాలు వేరుచేసే పనికి రాని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తారు. దీని వల్ల పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నది ఆలోచన.


నిరుపయోగంగా ఉన్న ఈ-ఆటోలు

రూ.40 లక్షలతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మించినా..

మండపేట తడిపొడి వ్యర్థాల నిర్వహణ మున్సిపల్ అధికారులకు సవాలుగా మారింది. తగినన్ని వాహనాలు లేకపోవడం వర్షాల కారణంగా డంపింగ్‌యార్డులోకి ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాలు తరలించే పరిస్థితి లేకపోవడం వల్ల పట్టణంలో అనేక ప్రాంతాల్లో రోడ్లపై చెత్త పోగులు దర్శనమిస్తున్నాయి. 2023లో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మించినా ప్రస్తుతం ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకపోవడంతో ఏడాది కాలంగా వృథాగా ఉండిపోయింది.

నిర్వహణ భారం

ఆటోలను ప్రభుత్వం కొనుగోలు చేసి సరఫరా చేసినప్పటికీ వీటికి మున్సిపాలిటీ ప్రతి నెల రూ.లక్షల్లో వాయిదాలు చెల్లించవలసి ఉంటుంది. ఇది కాకుండా సరఫరా చేసిన సంస్థ డ్రైవర్లను ఏర్పాటు చేస్తే డ్రైవర్‌కు రూ.24వేల చొప్పున ప్రతి నెల రూ. 2.40లక్షలు జీతాలు చెల్లించవలసి ఉంటుంది. ఈ నిధులన్నీ చెల్లించాలంటే మున్సిపాలిటీపై భారం పడనుంది.


వ్యర్థాలతో నిండి ఉన్న డంపింగ్ యార్డు

నిర్ణయం తీసుకోలేదు

ఈ ఆటోల నిర్వహణపై ప్రభుత్వ పరంగా ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. వాటిని ప్రారంభిస్తే ప్రతి నెల రూ.లక్షల్లో వాయిదాలు చెల్లించడంతో పాటు డ్రైవర్లకు జీతాలు కూడా మున్సిపల్ నిధులతో చెల్లించాలి. మరమ్మతులకు గురైతే స్థానికంగా మరమ్మతులు చేసే పరిస్థితి లేదు. ఎక్కడ నుంచో మెకానిక్‌లను పిలిపించాలి. దీని వల్ల మున్సిపాలిటీపై అదనపు భారం పడుతుంది. వీటికి బదులుగా పుష్‌కార్టులు కొనుగోలు చేస్తే నిర్వహణ సమస్య ఉండదు. ప్రభుత్వ పరంగా ఏనిర్ణయం తీసుకున్నా ఆమేరకు చర్యలు చేపడతాం.

- టీవి. రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట


ఈనాడు ప్రతిభ పాటవ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహం.. ప్రతిభకు ప్రోత్సాహం

మండపేట, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జవహర్‌లాల్ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 10వ తరగతి విద్యార్థిని వై.కిరణ్మయి ప్రథమ, 9వ తరగతి విద్యార్థిని డి.వాణి సురేఖకు ద్వితీయ, 8వ తరగతి విద్యార్థి టి.వీర శశాంక్ తృతీయ బహుమతులను సాధించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు దంటు శ్రీనివాస్, వారా లక్ష్మి, శ్రీరాముల అజిత వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చేగొండి వీరవెంకట సత్యనారాయణ మూర్తి ఈనాడు సమకూర్చిన బహుమతులు, ధ్రువపత్రాలు విజేతలకు అందించారు.



విజేతలతో ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్త తొలగించరూ..

సమస్య: మండపేట మండలం కేశవరం పంచాయతీ పరిధి దేవుడుతాళ్లు ఎస్సీ కాలనీ పాత రైతు భరోసా కేంద్రం వీధిలో రహదారి పక్కన చెత్త పోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్య పరిష్కరించాలి.

- అంజిబాబు, కేశవరం

సమాధానం: రహదారి పక్కన చెత్తను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- ఎన్.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి, కేశవరం

మురుగు పారడంలేదు

సమస్య: మండపేట మండలం జడ్.మేడపాడు పంచాయతీ పరిధి బీసీ కాలనీ రెండో వీధి డ్రెయినేజీలో మురుగు పారడంలేదు. స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కరించాలి.

- ఆర్ సుబ్బారావు, జడ్.మేడపాడు

సమాధానం: డ్రెయినేజీలో మురుగు పారుదల సమస్య సత్వరమే పరిశీలించి పరిష్కరిస్తాం.

- అమర్‌నాథ్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి, జడ్.మేడపాడు

– న్యూస్‌టుడే, ద్వారపూడి

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

గడువులోగా దరఖాస్తులన్నీ పరిష్కరిస్తాం


వెలగతోడులో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

అంగర, న్యూస్‌టుడే: రైతుల నుంచి వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించి, గడువు తేదీలోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ పైడి చిన్నారావు అన్నారు. మంగళవారం ఆయన కపిలేశ్వరపురం మండలం నేలటూరులో సర్పంచ్ వీరన్న అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో పాల్గొన్నారు. దరఖాస్తులను స్వీకరించారు. రీసర్వే భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన గ్రామసభలను రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి రమేష్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ద్వారపూడి: మండపేట మండలం వెలగతోడు పంచాయతీ కార్యాలయంలో రీ సర్వే భూ సమస్యల పరిష్కార వేదికలో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 13 అర్జీలు రెవెన్యూ అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బొల్లి తారకరామారావు, పంచాయతీ కార్యదర్శి వి. రామకృష్ణరాజు, గజ్జవరపు రామకృష్ణ, త్రిమూర్తులు, సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రాక్షారామ, పామర్రు: ఆంధ్రప్రదేశ్ భూముల రీసర్వే ప్రాజెక్టు పేరుతో రామచంద్రపురం మండలం కాపవరం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో భూ సమస్యలపై 45 అర్జీలు అందాయి. మండల తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ తప్పులు సరి చేసుకోడానికి ఇది ఒక మంచి అవకాశమన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గీసాల శతకోటి శ్రీనివాస్, మాజీ సర్పంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

● కె.గంగవరం మండలం ఎర్రపోతవరం గ్రామంలో తహసీల్దార్ బండి మృత్యుంజయరావు నేతృత్వంలో జరిగిన సభకు గ్రామ సర్పంచి పి. రాంబాబు అధ్యక్షత వహించారు. మండలాధ్యక్షురాలు పంపన నాగమణి అన్నారు.



ఎర్రపోతవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ పంపన నాగమణి

కాలినడకన అన్నవరం


ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మండపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ఎమ్మెల్యేగా 4వ సారి వేగుళ్ల జోగేశ్వరరావు విజయం సాధించినందుకు మొక్కు సమర్పించడానికి కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు అల్లూరి రామకృష్ణ చౌదరి అన్నవరం పాదయాత్రగా బయలుదేరారు. అంతకు ముందు స్థానిక కలువపువ్వు సెంటరులో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులు సాగే పాదయాత్రలో ఆటంకాలు కలగకూడదని కోరుతూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇతర తెదేపా నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. చంద్రు వీర్రాజు, ఉండవల్లి రాంబాబు, కొప్పిశెట్టి సత్యనారాయణ, కపిలేశ్వరపురం మండల అధ్యక్షుడు ముత్యాల వెంకట్రావు, నూని ఏసుబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

పామర్రు, న్యూస్‌టుడే: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పాఠశాలలు కేంద్రాలు కావాలని, ఉపాధ్యాయులు ఆ దిశగా కృషి చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం కె. గంగవరం కోటిపల్లి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు చూశారు. భోజనం బాగుంటోందా? సరిపడా పెడుతున్నారా? నాణ్యతతో ఉంటోందా? అంటూ విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. అసంపూర్తిగా రెండు తరగతి గదులు నిర్మాణం ఉందని వాటి నిర్మాణానికి పూర్తి స్థాయిలో నిధులు రావాల్సి ఉందని ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఆయన దృష్టికి తెచ్చారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవడానికి విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రయత్నిస్తున్నారని రాబోయే కాలంలో అన్ని సమస్యలకు తెరపడుతుందని మంత్రి సుభాష్ అన్నారు.

కోటలో ఆర్థికసాయం

కోటిపల్లి పర్యటనకు ముందు కె.గంగవరం మండలం కోట గ్రామంలో మంత్రి పర్యటించారు. స్థానికుడు, పేద కుటుంబానికి చెందిన కోసూరి సుబ్బారావు ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన సంగతి తెలుసుకున్నారు. వెంటనే అతనింటికి వెళ్లి భార్య సత్యవేణిని ఓదార్చి రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందించారు. మంత్రి వెంట పలువురు కూటమి నాయకులున్నారు.

మూసుకుపోతున్న రహదారి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణ పెద్ద వంతెన వద్ద వెల్ల రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కల కారణంగా ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వంతెన దిగుతుండగా వెల్ల రోడ్డులో సగం రోడ్డు కప్పడమే కాకుండా రోడ్లు భవనాలశాఖ ఏర్పాటు చేసిన గ్రామాలకు అటూఇటూ వెళ్లే మార్గాలను చూపించే బోర్డుపై పేర్లు, కిలోమీటర్లు కనిపించకుండా మొక్కలు పెరిగిపోయాయి. అంతేకాకుండా అటూ ద్రాక్షారామ వైపు నుంచి ఇటు రామచంద్రపురం వైపు నుంచి వస్తున్న వాహనాలు వెల్ల రోడ్డు నుంచి వస్తున్న ప్రయాణికులకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. 8వ వార్డు పరిధిలో ఉన్న ఈ ప్రాంత రోడ్డుపక్కనగల మొక్కలు తొలగించాలని పలువురు వేడుకుంటున్నారు. దీనిపై శానిటరీ తనిఖీదారు డేవిడ్‌రాజును వివరణ కోరగా పెద్ద వంతెన వద్ద వెల్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించేలా గ్యాంగ్ వర్కులను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.


ర.భ ఏర్పాటు చేసిన గ్రామాల బోర్డు కనిపించని వైనం

గుంతలతో తరచూ ప్రమాదాలు



కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి నుంచి కొత్తూరు సెంటరుకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు మధ్యలో భారీగా గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనపడకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంగర, వెదురుమూడి, నల్లూరు, వల్లూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, కాలేరు గ్రామాల ప్రజలు రావులపాలెం వెళ్లడానికి ఈ మార్గాన్నే ఎక్కువగా ఉపయోగిస్తారు. దీనిపై ర.భ శాఖ డీఈ సూర్యనారాయణను వివరణ కోరగా త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, అంగర**

చెత్తను తొలగించారు..

స్పందనకు వందనం

ద్రాక్షారామ: ద్రాక్షారామ నుంచి కాకినాడ వెళ్లే రహదారిలో తోటపేట గణేష్ రైస్‌మిల్లు వద్ద రహదారి పొడవునా వేసిన చెత్తను ఎట్టకేలకు పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. దీనిపై ఈనాడు పత్రికలో వెలువడిన కథనాలకు అధికారులు స్పందించి పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. దీంతో గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇకపై చెత్తను డంపింగు యార్డుల్లో వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బాలికలు అప్రమత్తంగా ఉండాలి

పామర్రు, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా పలు చోట్ల విద్యార్థినులు, యువతులు, మహిళలపై పలు రకాల లైంగిక దాడులు, వేధింపులు జరుగుతున్నాయి. ఇటువంటి వాటి నుంచి రక్షణ పొందడానికి చట్టాలున్నాయి. షీ టీములున్నాయి. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుని అప్రమత్తతతో ఉంటూ స్వీయరక్షణ పొందాలని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ సూచించారు. కె.గంగవరం మండలం కోటిపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు కౌమారదశలో విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కౌమారదశలో బాలికల్లో జరిగే శారీరక మార్పులు గురించి వివరించారు. ఎస్సై షేక్ జానీబాషా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ ఫిర్యాదుల పెట్టె ఒకటుందని, దీనిని మహిళా పోలీసులే తెరుస్తారని, తాళం చెవి కూడా వారివద్దనే ఉంటుందని, ఎవరికి ఏ సమస్య ఉన్నా పైకి చెప్పుకోలేని వారు నేరుగా ఈ పెట్టెలో ఫిర్యాదు వేస్తే తక్షణం స్పందిస్తామని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం


ఆసుపత్రిలో గదిని ప్రారంభిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంత్రి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేసిన 50 నాణ్యమైన మంచాలు, పరుపులు, 380 దుప్పట్లను ఏర్పాటుచేసిన గదిని మంగళవారం ప్రారంభించారు. గతంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ప్రవీణ్ ఆసుపత్రిలోని కాలం చెల్లిన, తుప్పు పట్టిన మంచాల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సమకూర్చినట్లు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. అనంతరం మంత్రి వైద్యసేవలపై తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి నిరుపేదలు వస్తారని వారందరికి మరింత నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. తల్లిదండ్రులు లేని ఒక యువకుడు ఆసుపత్రిలో వైద్యం పొందుతూ ఉండటంతో అతని నానమ్మకు మంత్రి రూ.5వేలు సాయం అందించారు. జనసేన ఇన్‌ఛార్జి గొల్లపల్లి కృష్ణ డాక్టర్ చక్రధర్, కళ్యాణ్‌బాబు, ఆసుపత్రి సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


నూతనంగా ఏర్పాటుచేసిన పడకలు

92 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


శిబిరంలో పాల్గొన్న సర్పంచి సతీష్‌కుమారి, సిబ్బంది

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వెంకటాయపాలెం సచివాలయం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచి యల్లమిల్లి సతీష్‌కుమారి ప్రారంభించారు. మొత్తం 92 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 15 మందికి ఆపరేషన్లు అవసరమని, 44 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. దీంతో పాటుగా 104 వాహనం ద్వారా రోగులకు రక్తపోటు, చక్కెర వ్యాధి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, ఏఎన్ఎం విజయ, హెల్త్ అసిస్టెంట్ భవాని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక కష్టాలకు చెల్లు

పామర్రు, న్యూస్‌టుడే: నదులు, వంకలు, వాగుల్లోని ఇసుకను ట్రాక్టర్లు, ఎడ్ల బండుల మీద ఉచితంగా తీసుకెళ్లవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం, ఆ నిర్ణయం వెంటనే అమల్లోకి రావడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. వైకాపా అయిదేళ్ల పాలనలో నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొట్టారు. గోదావరి నదిలో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి అప్పటి ప్రజాప్రతినిధుల అనుచరులు దోపిడీకి పాల్పడ్డారని వారు గుర్తు చేసుకుంటున్నారు.. రామచంద్రపురం నియోజకవర్గంలోని బ్రహ్మపురి, కోట, గోవలంక, కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం 1, కపిలేశ్వరపురం 2 రీచ్‌ల నుంచి ఇసుక, ఇదే గోదావరి నదీగర్భంలో పలు చోట్ల లంకమట్టి తవ్వేసేవారు. ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు దిగడానికి కూడా వెనుకాడేవారు కాదు.

సీనరేజీ అధికంగా ఉండడంతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల ఇబ్బందులను గమనించింది. ఎన్నికల ప్రచార సమయంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చేదిశగా చర్యలు చేపట్టింది. ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని ప్రకటించింది. ఈ దశలో స్థానికంగా కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయని, సీనరేజీ ఎక్కువగా ఉండడం వల్ల ఇసుక ఉచితంగా రావడం లేదని పలువురు కూటమి నేతలు, అధికారుల దృష్టికి తెచ్చారు. దానితో సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నదులు, వాగులు, వంకలు నుంచి ఇసుకను ఉచితంగా ట్రాక్టర్లు, ఎడ్ల బళ్ల మీద ఉచితంగా తీసుకెళ్ళొచ్చని చెబుతూ అందుకు తగిన ఆదేశాలు కూడా ఇప్పించారు. దీనితో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ప్రజలు తమ ట్రాక్టర్లను గోదావరి వైపునకు మళ్లిస్తున్నారు.


ఆలమూరు మండలం జొన్నాడలో ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

నిర్మాణ రంగానికి జవసత్వాలు

ఇసుక ఉచితంగా సరఫరా చేస్తుండడం, వినియోగదారులకు తక్కువ ధరకే అందుబాటులోకి రావడంతో ఇంటి నిర్మాణాలు ఊపందుకుంటున్నాయి. నదిలో ఇసుక తవ్వే కూలీలు నుంచి నిర్మాణ కార్మికులు, సెంటరింగ్, వైరింగ్, ప్లంబింగ్, టైల్స్ ఇతర గృహ పరికరాల పనులు చేసే కార్మికులందరికీ ఉపాధి పెరుగుతుంది. రామచంద్రపురం నియోజకవర్గం కూళ్ల, నరజాడ, తమ్మయపాలెం, మండపేట నియోజకవర్గం కోరుమిల్లి, తాతపూడి, కపిలేశ్వరపురంలలో ఇసుకను గోదావరి నుంచి తవ్వితీసేందుకు కూలీలున్నారు. సరఫరా చేసేందుకు ట్రాక్టర్లు, ఎడ్ల బండులు కూడా వారికున్నాయి. దీనితో కావాల్సినంత ఇసుక దొరుకుతుందని వినియోగదారులు సంబరపడుతున్నారు.

రూ.1500 ఇసుక వైకాపా పాలనలో రూ.5000

అసంఘటిత కార్మిక వ్యవస్థ ఎక్కువగా ఇసుక మీదనే ఆధారపడుతుంది. అంతకు ముందు వరకూ కేవలం రూ. 1500లకే దొరికే ట్రాక్టరు ఇసుక వైకాపా పాలనలో ఐదువేల రూపాయలై పోయి వినియోగదారులకు చాలా భారంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అన్ని కోణాల్లోనూ కూడా ఇసుక ఉచితంగా ఇవ్వడానికి కంకణం కట్టుకొంది. కొత్తగా ఇసుక రీచ్‌లకు టెండర్లు పిలిచి అవకాశం ఇస్తే నిర్వాహకులు ట్రాక్టర్ల మీద ఇసుక తీసుకెళ్లకుండా అడ్డుపడతారని భావించి ఆ విధానాన్ని కూడా రద్దు చేయడం అందరిలోనూ ఆనందం నింపుతోంది. అధికారులు కూడా తగువిధంగా స్పందించి ఇసుక ఉచితంగా అందేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'అన్యాయంగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారు'

రామచంద్రపురం: బలవంతంగా వాంగ్మూలాలు ఇప్పించి, అన్యాయంగా కేసులు బనాయించి ప్రతిపక్ష నాయకులను కావాలని అరెస్టులు చేస్తున్నారని రామచంద్రపురం నియోజకవర్గ వైకాపా కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ విమర్శించారు. మంగళవారం ఆయన పట్టణ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం పెట్టి అధికార పార్టీపై విమర్శలు గుప్పించారు. మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌ను అన్యాయంగా అరెస్టు చేశారన్నారు. గడిచిన నాలుగు నెలల కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పక్కన పెట్టి కేవలం డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, నాయకులు వాసంశెట్టి శ్యామ్, పెట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియ జీవోను అమలు చేయాలి: పీఆర్‌టీయూ

మామిడికుదురు: పాఠశాలల్లో తరగతుల విలీనానికి సంబంధించిన 117 జీవో రద్దు ప్రక్రియను వేగవంతంగా అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు అన్నారు. గోగన్నమఠం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మంగళవారం జరిగిన సంఘ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.